ఏళ్ల తరబడి.. తిరిగినా...

● రెవెన్యూ అధికారుల కటాక్షం లేక.. ● పాసుపుస్తకాలు రాక.. ఆన్‌లైన్ కాక..
● రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదుల వెల్లువ ● గోడు వెల్లబోసుకుంటున్న బాధితులు

ఏళ్ల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా రెవెన్యూ అధికారుల కటాక్షం లేక.. తరతరాలుగా అనుభవంలో ఉన్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు రాక.. అనుభవంలో ఉన్న భూమి ఆన్‌లైన్ కాక.. ఇబ్బందులు పడిన ప్రజల ఫిర్యాదులు రెవెన్యూ సదస్సుల్లో వెల్లువలా వస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారం కాలేదని బాధితులు అధికారుల ఎదుట గోడు వెల్లబోసుకుంటున్నారు.


మదనపల్లెలోని బసినికొండ రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. నాయకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా అప్పట్లో సాగింది. కొందరు రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులతో అంటకాగి పేదలకు అన్యాయం చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. వైసీపీ పాలనలో బాగా చెడ్డపేరు తెచ్చుకున్న, అక్రమాలు జరిగిన ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూదే ప్రథమ స్థానం అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. తరతరాలుగా అనుభవంలో ఉన్న భూములను సైతం వైసీపీ నాయకులు కొందరు రెవెన్యూ అధికారుల అండతో తమ పేరు మీద ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఎందరో భూములను దౌర్జన్యంగా కాజేశారు. అదే సమయంలో పలువురు రెవెన్యూ అధికారులు లంచాలకు ఆశపడి.. తాము అడిగినంత ఇవ్వలేదని పనులు చేయకుండా.. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ రెవెన్యూ సదస్సుల్లో అధికారులే.. ఇంతవరకు తమను కాళ్లరిగేలా తిప్పుకున్నారు.. ఇప్పుడు మళ్లీ వాళ్లకే ఫిర్యాదులు చేస్తే ఏం ఉపయోగం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

● వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామానికి చెందిన 30 మంది రైతులు వ్యవసాయ పొలాలకు ఉన్న దారి సమస్యపై తహసీల్దార్ పాములేటికి వినతి పత్రం అందజేశారు. కూరపర్తి గ్రామం నుంచి తంగేళ్లగుట్ట ప్రాంతం వరకు వ్యవసాయ పొలాలకు బండి బాట ఉందని, అయితే ఈమధ్య ప్రాంతంలో ఉన్న డీకేటీ భూముల్లో 250 మీటర్లలో దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు విన్నవించారు. అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ తప్పకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇదే పంచాయతీ పరిధిలోని గంగాదొడ్డి ప్రాంతం రైతులు కూడా వ్యవసాయ పొలాలకు దారి సమస్య పరిష్కరించాలని కోరారు.

● పుల్లంపేట మండలం పుత్తనవారిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో చెరువు ఆక్రమణపై సర్వే చేయాలని అలాగే గ్రామంలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకుని.. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గ్రామస్తుడు నరేష్ ఫిర్యాదు చేశారు.

● ఒంటిమిట్ట మండలం మంగంపేట గ్రామంలో 26 మంది తమ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. నడింపల్లెకు చెందిన బిల్లా లక్ష్మీనరసయ్య తన ఆధీనంలో మంగంపేట పరిధిలో భూమి ఉందని, తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న మరో వ్యక్తి ఆ భూమిలో తమకు కూడా హక్కులు ఉన్నాయని,అనడంతో.. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.

● రాజంపేట మండలం కొత్తపల్లెలో పి.వెంకటసుబ్బయ్య అనే రైతు రెండు సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. కడప-రేణిగుంట హైవేకు తనకు సంబంధించిన భూమి ఆరు సెంట్లు పోయిందని, ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. గతంలో తనకు ఇచ్చిన భూమికి దారి లేదని, ఇతరులు ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నా భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించండి
- ఆదినారాయణ, వీరబల్లి



మండలంలోని వంగిమళ్ల పంచాయతీ వనంకాడపల్లె పంచాయతీ 296 సర్వే నెంబరులో 3.50 ఎకరాలు భూమి నా పాసుపుస్తకంలో ఉంది. మేము ముగ్గురం అన్నదమ్ములం. నా పేరు మీద 1.20 ఎకరాలు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. మిగతా ఇద్దరికీ ఆన్‌లైన్ చేయాలి. గత పది సంవత్సరాల క్రితం ఇచ్చిన పట్టా.. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా.. ఇంతవరకు ఆన్‌లైన్ చేయలేదు. మా భూమి మరెవరి పేరు మీదో ఆన్‌లైన్ అయింది. తిరిగి మీకే ఎక్కిస్తామని చెబుతూనే కాలం గడిపేస్తున్నారు. ఇప్పుడు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశాను.

పూర్వీకుల ఆస్తిని పాసు పుస్తకంలో ఎక్కించడం లేదు
- వెంకటరాయుడు, లింగమ్మ, సూరప్పగారిపల్లె, పీలేరు



మా పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని పాసు పుస్తకాల్లో ఎక్కించమని 2015 నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాము. తలపుల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.1434/2లో మాకు మా పూర్వీకుల నుంచి 1.20 ఎకరాల భూమి సంక్రమించింది. దానిపై ఎటువంటి వివాదం లేదు. అయితే మాకు సంబంధించిన ఇతర పొలాలపై ఉన్న కోర్టు లావాదేవీలను బూచిగా చూపించి అధికారులు పట్టించుకోవడం లేదు. వాటికి, ఈ భూమికి ఎటువంటి సంబంధం లేదని ఎన్ని రుజువులు చూపించినా పట్టించుకోవడం లేదు. పీలేరు తహసీల్దారు దగ్గర నుంచి జిల్లా కలెక్టర్ వరకు అనేక దఫాలు అర్జీలు ఇచ్చాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీలేరు తాహసీల్దార్ కార్యాలయంలో చాలాసార్లు మ్యుటేషన్ కోసం నాతో దరఖాస్తు చేయించారు. దానిని ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టారు. తిరిగి తిరిగి విసిగిపోయాము. ఈ రోజు మా గ్రామానికి ఆర్డీవో వచ్చారంటే ఆశ చావక మళ్లీ ఫిర్యాదు చేశాము. రెండు, మూడు రోజుల్లో పరిష్కారం చేస్తామన్నారు. వేచి చూడాలి.

న్యాయం జరుగుతుందనే ఆశిస్తున్నా..
- బసిరెడ్డి, ముడియంవారిపల్లి, కలకడ



ముడియంవారిపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో నాకు భూమి ఉంది. నా పేరిట మంజూరైన పట్టాదారు పాసు పుస్తకం ఖాతా నెంబరు-665లో రికార్డుల ప్రకారం.. విస్తీర్ణం మొత్తం 97 సెంట్లు ఉండాలి. అయితే అందులో 73 సెంట్లు మాత్రమే నమోదైంది. మిగిలిన 24 సెంట్లు పాసుపుస్తకంలో చేర్చాలి. గతంలో పలు దఫాలు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల వల్ల అయినా నాకు న్యాయం జరుగుతుందనే ఆశిస్తున్నా..

ఆలయ భూములకు పాసుపుస్తకాలు ఇవ్వండి..
- చంద్రశేఖర్‌శాస్త్రి, పూజారి, పెద్దతిప్పసముద్రం



పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామంలోని 509, 511 సర్వే నెంబర్లలో చెన్నకేశవస్వామి దేవాలయం, సోమేశ్వరస్వామి ఆలయాలకు చెందిన సుమారు ఏడు ఎకరాల భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. ఆలయ ఈవో మునిరాజు, అసిస్టెంట్ రమణ లతో కలిసి చెన్నకేశవ స్వామి ఆలయపూజారి చంద్రశేఖర్‌శాస్త్రి ఈ ఆలయాలకు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చారు. ఈ సమస్యను 60 రోజుల్లోగా పూర్తి చేస్తామని తహసీల్దార్ శ్రీరామ్‌నాయక్ తెలిపారు.

26 ఏళ్లుగా దరఖాస్తు చేస్తూనే ఉన్నా
- కె.తిమ్మరాయప్ప, కొండామర్రిపల్లె, మదనపల్లె



1998లో మదనపల్లె మండలం కొండామర్రి గ్రామంలో 37.5 సెంట్ల భూమి కొన్నాను. రికార్డులన్నీ సక్రమంగానే ఉన్నాయి. పాసుపుస్తకం, వన్‌బీ కోసం ఇప్పటి వరకు పది సార్లు దరఖాస్తు చేశాను. ఇంతవరకు రాలేదు. ఈ రెవెన్యూ సదస్సులతో అయినా.. నా భూమికి పాసుపుస్తకం వస్తుందని ఆశిస్తున్నాను..

పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయండి..
- ప్రసాద్, గోపిదిన్నె, తంబళ్లపల్లె



గోపిదిన్నె గ్రామంలో ఐబి నెంబరు 232, సర్వే నెంబరు 904/1లో 1.19 సెంట్ల భూమి ఉంది. దీనిని భాగ పరిష్కారం కోసం నా పేరిట పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయండి.. ఈ రెవెన్యూ సదస్సులతో పరిష్కారమైతే అంతే చాలు.

గత ప్రభుత్వ పాపాలతోనే భూసమస్యలు

● ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి
● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాపాలతోనే ప్రజలకు భూ సమస్యలు పెరిగిపోయాయని, రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలకు సంబంధించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబేపల్లె మండలం పీఎన్ కాలనీలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. గతంలో ప్రజలు భూసమస్యలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నేడు గ్రామ స్థాయిలో భూవివాదాల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు అర్జీ రూపంలో తమ సమస్యలు తెలియజేసి ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డీకేటీ, రీసర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులు సమన్వయంతో భూసమస్యల పరిష్కారానికి పని చేయాలన్నారు. ఏ ఒక్క అర్జీని కూడా మిస్ చేయకూడదన్నారు. స్వయంగా ప్రజల నుంచి మంత్రి అర్జీలను తీసుకుని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డ్వామా పీడీ వెంకటరత్నం, తహసీల్దార్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, సర్పంచ్ మోహన్, ఎంపీటీసీ రామరాజు, మాజీ సర్పంచులు శశిధర్‌రెడ్డి, గోపాల్, గిడ్డయ్య, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, విష్ణువర్ధన్‌రాజు, యువగళం సిద్దారెడ్డి, భాస్కర్, సుబ్బరాజుయాదవ్, కొండమర్ల రామచంద్ర, భయ్యారెడ్డి, శేఖర్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, మనోహర్‌రెడ్డి, అధికారులు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆర్‌వోఆర్ కోర్టు ప్రారంభం

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


మరమ్మతులపై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్


సబ్‌కలెక్టరేట్‌లో కోర్టు హాలు గోడలకు అంటిన పొగ మరకలు శుభ్రం చేస్తున్న కార్మికులు

మదనపల్లెటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లోని ఆర్‌వోఆర్ కోర్టు (రికార్డ్ ఆఫ్ రైట్స్) హాలును ఈనెలాఖరులోగా పునఃప్రారంభించనున్నట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఈ ఏడాది జూలై 21వ తేదీ రాత్రి ఫైళ్ల దహనం సంఘటనలో కోర్టు హాలులో మంటల పొగలు వచ్చి గోడలు, ఫర్నీచర్ నల్లగా మారిపోయాయి. ఈ క్రమంలో ఆరు నెలలుగా ఆర్‌వోఆర్ కోర్టు నిర్వహణ జరగలేదు. ఈ క్రమంలో సబ్‌కలెక్టర్ చొరవ చూపి కోర్టు హాలులో గోడలను నీటితో కడిగించి, కొత్తగా పెయింట్లు వేయిస్తున్నారు. అంతేకాకుండా ఫర్నీచర్ మరమ్మతులు చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా గత శనివారం సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోనే ఆర్‌వోఆర్ కోర్టు నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడ ఇబ్బందిగా ఉండటంతో కోర్టు హాలును డీఏవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ నెలాఖరులోగా కోర్టుహాలులోనే ఆర్‌వోఆర్ కోర్టు నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

రాజంపేటలో జయంతికి స్టాపింగ్

● రైల్వే శాఖ ఉత్తర్వులు: సాయిలోకేశ్

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజంపేట రైల్వేస్టేషన్‌లో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ ఆగకపోవడంతో శబరిమలకు వెళ్లే వందలాది మంది భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, సికింద్రాబాద్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మేనేజర్ పద్మజకు వినతిపత్రం ఇచ్చానని తెలిపారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురంధేశ్వరి కూడా జయంతి ఎక్స్‌ప్రెస్‌పై రైల్వేమంత్రితో మాట్లాడి వినతిపత్రం ఇచ్చారన్నారు. తమ వినతి మేరకు బుధవారం నుంచి రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగుతుందని ఆయన తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో వ్యవసాయానికి పెద్దపీట

● ఉద్యానశాఖపై ప్రత్యేక దృష్టి
● మదనపల్లె ఫైల్స్ దహనంతో పకడ్బందీ చర్యలు
● విజయవంతంగా ఉచిత ఇసుక అమలు
● సీఎం నివేదికలో పేర్కొన్న కలెక్టర్
● నేడు సీఎం సదస్సుకు బయలుదేరిన కలెక్టర్ శ్రీధర్



రాయచోటి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు అన్ని జిల్లాల కలెక్టర్లతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సుకు అన్నమయ్య జిల్లాకలెక్టర్ చామకూరి శ్రీధర్ ఇప్పటి వరకు అభివృద్ధిలో అందిన ఫలితాలు, తీసుకోనున్న ప్రణాళికల పూర్తి సమాచారంతో విజయవాడకు బయలుదేరారు. ఈ నివేదికలోని కొన్ని అంశాలు....అన్నమయ్య జిల్లా వ్యవసాయాధారిత జిల్లా. ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. కావున జిల్లా అభివృద్ధిలో భాగంగా వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎక్కువ పోషక విలువలు కలిగిన వరి వంగడాలను, రాగి, సద్ద, జొన్న వంటి పంటల సాగుకు రైతులకు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని నివేదికలో పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని, ప్రస్తుతం జిల్లా పాల ఉత్పత్తిలో రాష్ట్ర స్థాయిలో ఏడో స్థానం, మాంసం ఉత్పత్తుల్లో 7వ స్థానం, కోడిగుడ్ల ఉత్పత్తిలో 16వ స్థానంలో ఉందన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి 1200 గోకులం షెడ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఇప్పటికే 1009 గోకులం షెడ్లు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో కొత్తరకం పండ్ల తోటలైన డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, జామూన్, ఆమ్లతో పాటు అరటి, బొప్పాయి తోటల పెంపకానికి ఎంఐడీహెచ్, ఎన్ఆర్ఈజీఎస్ పథకాలతో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మదనపల్లె ఫైల్స్ దహనంతో పకడ్బందీ చర్యలు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో కీలక ఫైళ్ల దహనం ఘటన తరువాత రెవెన్యూకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా అసైన్‌మెంట్, డాటెడ్, ఫ్రీహోల్డ్ భూములపై సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 1,35,266.91 ఎకరాల భూములు ఉండగా అందులో 69,886.94 ఎకరాల భూముల విషయంలో అవకతవకలు జరిగాయని, అలాగే 28,898 ఎకరాల చుక్కల భూముల్లో 11,510 ఎకరాల్లో అవకతవకలు గుర్తించినట్లు నివేదికలో పేర్కొన్నారు. 4,290 ఎకరాల ఇనాం భూముల్లో 292 ఎకరాల్లో అవకవతకలు జరిగాయని, 4,520 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల్లో 2,425 ఎకరాలు చట్టప్రకారం ఉండగా, మిగిలినవి చట్టవ్యతిరేకంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల నిఘాలో భద్రపరచాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఉచిత ఇసుక పథకం అందుబాటులో తీసుకురావడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు రోడ్లపై గుంతలు లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మరిన్ని అంశాలను సదస్సులో ప్రస్తావించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు సరైన చర్యలు చేపట్టేందుకు కలెక్టర్ విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

● టీటీడీ జేఈవో వీరబ్రహ్మం


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోదండరాముడి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. మంగళవారం స్థానిక పీఏస్సీలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కోదండరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ రామాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆలయంలో నీటి సమస్య లేకుండా పైపులైను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రామాలయ విశిష్టతపై సోషల్ మీడియాతో పాటు టీటీడీ ఎస్వీబీసీ అనుసంధానంతో ప్రచారం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం భక్తులకు అందజేస్తున్న ఉచిత అన్న ప్రసాదాన్ని పరిశీలించి భక్తులతో మాట్లాడారు.

ప్రాథమిక నివేదిక తయారు చేయండి

బ్రహ్మోత్సవాలకు అవసరమయ్యే నిధులకు సంబంధించి ప్రాథమిక నివేదిక తయారు చేయాలని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. బ్రహ్మోత్సవాల నాటికి చేపట్టాల్సిన పనులు, అలంకార మండపం, పూజకు అవసరమయ్యే వస్తువుల సేకరణ, భక్తులకు అవసరమయ్యే సెంటర్లు, తాగునీటి సరఫరా, లైటింగ్ ఇతర పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

భూములకు హద్దులను కేటాయించండి

కోదండరాముడికి సంబంధించిన భూములకు స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కోదండరాముడి భూముల హద్దులకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, అందుకు రూ.2 కోట్ల నిధులు కూడా మంజూరు చేస్తామని ఆయన సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ స్పెషలాఫీసర్ ప్రశాంతి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, గుణభూషణ్‌రెడ్డి, ఈఈ సుమతి, డీఈ వెంకటేశ్వర్లు, ఎ.అమర్‌నాథరెడ్డి, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

అంగళ్లులో మళ్లీ భూవివాదం

● వివాదాస్పద భూమిలో ఫెన్సింగ్
● ఆక్రమణదారులకు టీడీపీ నేత మద్దతు
● వాహనాలకు టీడీపీ జెండాలతో భూమిలోకి...


టీడీపీ జెండాలతో వివాదాస్పద భూమిలో ఆక్రమణదారుల వాహనాలు

కురబలకోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లులో మళ్లీ భూవివాదం నెలకొంది. అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనే ఉన్న విలువైన భూమిని ఆక్రమించుకోవడానికి ఆక్రమణదారులు ప్రయత్నించారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వే నెంబర్ 220లో 69.42 ఎకరాల భూమి ఉండగా ఇందులో దాదాపుగా 7.66 ఎకరాల భూమికి సంబంధించి గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ భూమిని ఆరేళ్ల క్రితం కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో ఆ భూమిలో అక్కడికి ఎవరూ వెళ్లకుండా 145 సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం కొన్నేళ్లపాటు ఈ భూమిలోకి ఎవ్వరూ వెళ్లలేదు. అయితే మూడేళ్ల క్రితం ఈ భూమిని ఆక్రమించుకోవడానికి పులివెందులకు చెందిన వ్యక్తులు ప్రయత్నించారు. దీంతో అప్పట్లో వివాదం నెలకొనడంతో వైసీపీకి చెందిన పలువురు రాజకీయ నాయకులు జోక్యం చేసుకుని భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి డబ్బులు వసూలు చేసి సెటిల్‌మెంట్ చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో గత నెల 25వ తేదీ తిరుపతి, అనంతపురం జిల్లాలకు చెందిన పలువురు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా భూ హక్కుదారులు అడ్డుకుని, రోడ్డుపై ఆందోళన చేయడంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో కబ్జాదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే మళ్లీ తాజాగా ఈ భూమి తమకు చెందుతుందని స్థానికుల అండతో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత దాదాపుగా 200 మందితో వచ్చి రెండు ఎకరాలలో రాళ్లతో ఫెన్సింగ్ వేయించాడు. అంతేకాకుండా టీడీపీ జెండాలను తమ వాహనాలకు కట్టుకుని ఆ భూమిలోకి వెళ్లడం చర్చనీయాంశమైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీస్తే దాడులు చేస్తారనే భయంతో ఎవ్వరూ అక్కడికి వెళ్లలేదు. దీంతో వారు ఫెన్సింగ్ పూర్తి చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ముదివేడు పోలీసులు అక్కడికి చేరుకుని దీనిపై విచారించారు. నిత్యం వివాదాలకు నెలవైన ఈ భూసమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో వేచిచూడాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి వివాదాలు సద్దుమణుగుతాయని ఎదురు చూస్తున్న జనాలకు మళ్లీ ఇలాంటి ఘటనలు జరుగుతుండ టంతో ఏ ప్రభుత్వం వచ్చినా ఇంతేనన్న నిట్టూర్పు విడుస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

● జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ రమణ

రాయచోటిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎటువంటి సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం రాయచోటి విద్యుత్ శాఖ సర్కిల్ ఆఫీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇంజనీర్లు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన సర్కిల్‌లో ఉన్న సమస్యలపై అన్ని డివిజన్‌ల అధికారులతో చర్చించారు. సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం మన కర్తవ్యం అని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులున్నా నా దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం సర్కిల్ ఆఫీస్ బిల్డింగ్‌కు సంబంధించిన సర్దుబాట్ల గురించి రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యుగంధర్‌తో చర్చలు జరిపారు. చాలామంది ఉద్యోగులు ఎస్ఈ రమణకు జాయినింగ్ లెటర్స్ ఇచ్చి సర్కిల్ ఆఫీస్‌లో జాయిన్ అయ్యారు.

ప్రారంభం కానున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

● రైల్వే ప్రయాణికులు, ఎర్రగుంట్ల వాసులకు ఊరట
ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందించిన రైల్వే అధికారులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులు, ఎర్రగుంట్ల వాసులు కల ఫలించినట్లైంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. వృద్ధులు, వికలాంగులు, భారీ లగేజీ ప్రయాణీకులు, రాత్రిళ్ల స్త్రీల భయాలకు తెర పడనుంది. ఆంధ్రజ్యోతి కథనాలపై రైల్వే అధికారులు స్పందించిన వివరాల్లోకెళితే...

పెరిగిన రైళ్ల వేగంతో నిబంధనలు అనుసరించి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ నిర్మించడంతో స్టేషన్‌లోపలికి వెళ్లేందుకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, భారీ లగేజీ, చిన్నారులతో వచ్చే ప్రయాణికుల పరిస్థితి దారుణం. రాత్రి పూట స్త్రీలు రావాలంటేనే భయపడేవారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు, ఉత్తరం వైపున్న పోస్టాఫీసు, దక్షిణం వైపున్న నగర పంచాయతీ కార్యాలయం, కాలేజీలు, బస్టాండు, బ్యాంకులు, అవసరాల కోసం రాకపోకలకు ఒకటిన్నర కిలోమీటర్ దూరం తిరిగి రాలేక రైల్వేస్టేషన్ నుంచే వచ్చే వారు. దీంతో ప్రహరీ ఎక్కి దిగే ప్రయత్నాల్లో ఒకరు మృతి చెందగా, మరికొందరు వికలాంగులుగా మారారు. రెండు ప్లాట్ ఫారాలను కలుపుతూ నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దక్షిణం వైపున ప్రయాణికులు గ్రామంలోకి వెళ్లేందుకు పొడిగించారు. అయితే గతంలో రైల్వేస్టేషన్ ఫుట్‌ఓవర్ పక్కనే వుండడంతో ఉత్తరం వైపు పొడిగించలేదు. రైళ్లు దిగిన ప్రయాణికులు అధికభాగం ఉత్తరం వైపున్న ప్రొద్దుటూరు, ఇతర గ్రామాలకు వెళ్లేం దుకు బస్సుల కోసం వెళ్తారు. దీంతో ప్లాట్ ఫారాలపై దిగిన ప్రయాణికులు తప్పక రైల్వే స్టేషన్‌లోకి వెళ్లి తిరిగి బయటికి రావాల్సిన పరిస్థితి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రహరీ బయటికి ఉత్తరం వైపు ప్రొద్దుటూరు రోడ్డులోకి వెళ్లేందుకు అనువుగా


ఉత్తరం వైపు పొడిగించాల్సిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

నిర్మించాలని అనేక సార్లు వినతులు వెళ్లాయి. సంతకాల సేకరణ కూడా చేపట్టి డీఆర్‌ఎం, జీఎం స్థాయి అధికారుల దృష్టికి ప్రయాణికుల అవస్థలను ఆంధ్రజ్యోతి తీసుకెళ్లింది. డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ దృష్టికి కూడా తీసుకెళ్లగా ఆయన నేరుగా పరిశీలించి వెంటనే స్పందించారు. బ్రిడ్జి ఆవశ్యకతను గుర్తించి టెండర్లు పిలిచి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేశారు. టెండర్లు పూర్తయి నాలుగు నెలలవుతున్నా డిజైన్ కోసం సికింద్రాబాద్‌లో జాప్యం జరిగిందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవల ఎర్రగుంట్లకు వచ్చిన డీఆర్‌ఎం విజయకుమా ర్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆయన కూడా స్పందించారు. పదిరోజుల్లో కచ్చితంగా నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చినట్లు వచ్చే వారంలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఐఓడబ్లు అధికారులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీంతో ప్రయాణికుల, ఎర్రగుంట్ల ప్రజల అవస్థలు తీరనున్నాయి.

18మంది గంజాయి విక్రేతలు అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ కొండయ్య నాయుడు

మదనపల్లె అర్బన్, డిసెంబ రు 10(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణలో భాగంగా మదనపల్లె డివిజన్‌లో పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తూ, వాడుతున్న 18 మంది నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు ప్రకటించారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ కార్యాలయంలో మీడియా సమావేశంలో డీఎస్పీ అరెస్టు చూపి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు పుంగనూరు చెందిన వ్యక్తిగా వివరాలు సేకరించామని, త్వరలోనే అతన్ని అరెస్టు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. మిగిలిన తొమ్మిదిమందికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. 18మంది గంజాయి విక్రేతల వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, భగత్‌సింగ్ కాలనీ వాసి ఆవుల నరసింహులు, నరసింహులు భార్య ఆవుల రెడ్డెమ్మ, ఆవుల చిన్నయ్య, మదనపల్లె పట్టణం, మాయా బజార్ వా సి రామిశెట్టి హర్ష వర్ధన్, త్యాగరాజవీధికి చెందిన కార్తీ క్ పవన్, కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన గాలిగొట్టి



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు తదితరులు

బాల కృష్ణారెడ్డి వన్‌టౌన్ పరిధిలో ఉన్నారు. చంద్రాకాలనీకి చెందిన ఆవుల లక్ష్మయ్య, పుంగనూరు మండలం భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఎరుకుల రమణమ్మ, మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జబరు స్నీసా (ఆప), మదనపల్లె రాంనగర్‌కు చెందిన జి. సైపుల్లా, మాయా బజార్‌కు చెందిన బొమ్మలేరు నరసింహులు టూ టౌన్ స్టేషన్ పరిధిలో ఉన్నారు. ముదివేడు పీఎస్ పరిధికి చెందిన కురబల కోట మండలం, అంగళ్లు పంచాయతీ ఆర్అండ్‌బీ కాలనీకి చెందిన గుర్రకొండ మహమ్మద్ రఫీ, అదేకాలనీకి చెందిన ఉల్లిభారతి, అంగళ్లకు చెందిన పఠాన్ ముజీబ్‌ఖాన్, మదనపల్లె పట్టణం, జీఎం నగర్‌కు చెందిన కె. నవీన్‌కుమార్, తంబళ్లపల్లె మండలం, మట్లివారిపల్లెకు చెందిన ప్రశాంత్ కుమార్‌రెడ్డి, కలకడ మండలం, బాలయ్యగారిపల్లెకు చెందిన షేక్ సురజ్ బాషాగా గుర్తించారు. కార్యక్రమంలో మదనపల్లెలోని వివిధ పోలీసు స్టేషన్ సీఐలు రిరిసావలి, రామచంద్ర, కళా వెంకట రమణ, రమేష్, ఎస్ఐలు హరిహరప్రసాద్, రహిముల్లా, దిలీప్ కుమార్, శివకుమార్, బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి గంజాయి అమ్ముతున్న తాగుతున్న నిందులను అదుపులోకి తీసుకున్నారు.

వీరి నుంచి నాలుగన్నర కిలోల గంజాయి, ఒక మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నా రు. దీని విలువ రూ. 1లక్ష 30 వేలు, ఉంటుందన్నారు. ప్రతిభ కనపర్చిన ఎస్ఐలు హరి హరప్రసాద్, రహిముల్లా, దిలీప్‌కుమార్, శివకుమార్, కానిస్టేబుల్స్ పురుషోత్తమ, చంద్రప్ప కు రివార్డుల కోసం ఉన్నతాధికారుల కు సిఫార్స్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రం - జ్యోతిక్షేత్రం

భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం అవధూత కాశిరెడ్డి నాయన
14,15 తేదీల్లో 29వ ఆరాధనోత్సవాలు ● ముమ్మర ఏర్పాట్లలో నిర్వాహకులు



కాశినాయన డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటూ వచ్చిన వారికి కడుపు నిండా అన్నం పెట్టిపంపే అవధూత కాశిరెడ్డి నాయన సమాధి నిష్టవహించిన జ్యోతిక్షేత్రం భక్తులకు కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఎత్తైన నల్లమల కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతా వరణంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం గా గుర్తింపు పొందింది. పచ్చని పచ్చిక పరిచినట్లున్న ప్రాంతం పర్యాటకులు, భక్తులను ఆకట్టుకుంటోంది. జ్యోతి క్షేత్రంలోని కాశినాయన పాలరాతి సమాధిని దర్శించుకుంటే తమ కోర్కెలు తీరు తాయని దర్శించుకుంటూ ముం దుకు సాగాడు. ఇందులో భాగంగా కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో పాడుబడిన అనేక

సమాచారం. ఎక్కడ కాశిరెడ్డినాయన ఆశ్రమం ఉందంటే అక్కడ నిత్యాన్నదానం ఉన్నట్లేనంటారు భక్తులు వయస్సు పైబడిన కాశినాయన చివరి అంకంలో తనఇష్టదైవమైన జ్యోతిక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 1995 డిసెంబరు 5వ తేదీన శివైక్యం చెందారు. కాశిరెడ్డినాయన అభీష్టం మేరకు జ్యోతి క్షేత్రంలోనే సమాధి చేశారు. కాశినాయన ఎంతో ఇష్టంగా పెంచుకున్న గోమాత కాశినాయన సమాధి అయిన కొన్నిది నాలకే మృతి చెందింది. అక్కడే గోమాతకు సైతం అక్కడే సమాధి కట్టించారు. ప్రస్తుతం జ్యోతిక్షేత్రంలో కాశినాయన పాలరాతి సమాధిపై 60తెలుగు సంవత్సరాలకు

భక్తుల ప్రగాఢ నమ్మకం. దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి పుణ్యక్షేత్రాల పర్యటనకు వచ్చే యాత్రికులు సైతం జ్యోతిక్షేత్రాన్ని దర్శించుకుని వెళుతుంటారు. ఎంతో దివ్యక్షేత్రంగా విరాజిల్లే జ్యోతిక్షేత్రంలో కాశిరెడ్డి నాయన 29వ ఆరాధనోత్సవాలు 14, 15 తేదీల్లో వేడుకగా నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వివరాల్లోకెళితే...

కాశిరెడ్డి నాయన నేపథ్యం

నెల్లూరు జిల్లా సీతారామాపురం మండలం బెడుసుపల్లెలో మున్నెల్లి కాశమ్మ, సుబ్బారెడ్డి పుణ్య దంపతుల రెండవ సంతానం కాశినాయన. ఆయన అసలు పేరు మున్నెల్లి కాశిరెడ్డి. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక భావాలు కల్గిన కాశిరెడ్డి నాయన గురువు అతిరాచ గురవయ్య భావాలకు ప్రభావితుడై ఆధ్యాత్మిక చింతనతో కాశి నుంచి కన్యాకుమారి వరకు పుణ్యక్షేత్రాలను దేవాలయాలను పున ర్నిర్మించి గోశాలలు, అన్నదానాలు ఏర్పాటు చేయించాడు. మండలంలోని నాయనపల్లె, గంగనపల్లె, వరికుంట్ల, ముదిరెడ్డి పల్లె సమీపంలోని లింగమయ్య కొండ తదితర గ్రామాల్లో సంచరిస్తూ ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తూ రాత్రివేళ చిన్నపిల్లకు విద్యాబుద్ధులు నేర్పుతూ ఈప్రాంతీ యులకు సుపరిచితుడయ్యారు. అనంతరం జ్యోతిక్షేత్రం లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం చేరుకుని పూజాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవారు. అంతేకాకుండా గరుడాద్రిలో కఠోర తపస్సు చేశారు. జ్యోతి క్షేత్రంలో అన్నపూర్ణా దేవిని ప్రతిష్ఠించారు. మారుమూల పల్లెలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన కాశిరెడ్డినాయన ఆకలిగొన్న వారికి పిడికెడు అన్నం పెట్టడం, గోమాతలను సంరక్షించడం ఇష్టంగా అలవర్చుకున్నాడు. తన వద్దకు వచ్చిన భక్తులకు కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తూ ముందుకు సాగారు. ఆయన ఆలయాలను పునర్నిర్మించిన ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చారు. నేటికీ ఆయన ప్రారంభించిన అన్నదాన కార్యక్రమాలు దేదీప్యమాణంగా వెలుగొందుతున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 100 కాశిరెడ్డినాయన దేవాలయాలున్న

ప్రతీకగా 60 రాతిస్తంభాలతో వివిధ కళారూపాలతో మహాద్భుతంగా కాశినాయన దేవాలయ నిర్మాణం జరుగుతోంది.

జ్యోతిక్షేత్రానికి మార్గం

గుంతకల్లు, కర్నూలు, గుంటూరు తదితర దూర ప్రాంతాల నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు బస్టాండుకు, రైల్వేస్టేషన్‌కు వచ్చిన భక్తులకు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు. కడప జిల్లా మైదుకూరు మీదుగా వచ్చే భక్తులు పోరుమామిళ్లకు వచ్చేదారిలోని అమగంపల్లె నుంచి సావిశెట్టిపల్లె, వరికుంట్ల మీదుగా ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ వాహనాల్లో జ్యోతి క్షేత్రానికి చేరుకోవచ్చు. పోరుమామిళ్లకు వచ్చిన భక్తులు ఆర్టీసీ బస్టాండు నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా, ప్రైవేట్ వాహనాల్లో కలసపాడుకు పోయే దారిలోని ఓబుళాపురం నుంచి నర్సాపురం మీదుగా జ్యోతి క్షేత్రానికి చేరుకోవచ్చు.

నిరుద్యోగులకు సౌదియాలో ఉద్యోగాలు

● ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి నాగార్జున

రాయచోటిటౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అన్నమయ్య జిల్లా అధికారి నాగార్జున పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఓంక్యాప్, అల్ యూసుఫ్, ఎంటర్‌ప్రైజెస్ ద్వారా బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులకు సౌదీ అరేబియా దేశంలో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లాలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 35 ఏళ్ల లోపు అభ్యర్థులు ఏడాదిన్నర నర్సింగ్‌లో అనుభవం కలిగిన అభ్యర్థులు సౌదీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సౌదీ అరేబియాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు పురుషులకు భారత కరెన్సీలో సుమారు రూ.78 వేలు, మహిళలకు రూ.89 వేలు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం skillinternational@apsscdc.inకు 18వ తేదీలోగా బయోడేటా పంపించాలన్నారు. వివరాలకు 9988853335, 9712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లు

- జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి వ్యాఖ్య

రాయచోటి టౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్రం రాకముందు గానీ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గానీ సామాజిక మార్పుల్లో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తూ మెరుగైన సమాజం కోసం సోషల్ ఇంజనీర్లుగా పేరు తెచ్చుకున్నారని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కడప, అన్నమయ్య జిల్లాల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ నేతృత్వంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఐఏఎల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహానుభావులు బ్రిటీష్ వారిపై పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించారని, వారంతా న్యాయవాదులేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అంబేడ్కర్ సహా చాలా మంది న్యాయవాదులు రాజ్యాంగ నిర్మాణ దశలో, రాజ్యాంగం అనుసరించి చేస్తున్న చట్టాల అమలు విషయంలో కానీ న్యాయ మూర్తులు ఉత్తమమైన తీర్పులు చెప్పడంలో గానీ న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తూనే వస్తున్నారని ఆయన కొనియాడారు. సమాజంలో ఎలాంటి సందర్భాల్లో వ్యక్తులు నేరాలకు పాల్పడుతున్నారో అందుకు గల సామాజిక పరిస్థితులను సవివరంగా వివరించి శిక్ష వేయడంలో న్యాయమూర్తులు ఆలోచింపజేసేలా చేసే శక్తి న్యాయవాదులకు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, ఏపీపీ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ధనుంజయ్‌కుమార్, ఆనంద్‌కుమార్, రామాంజనేయులు, వీరభద్ర య్య, నాగమల్లు, రెడ్డిబాషా, టీవీ రమణ, కిజర్‌అలీ, ఆదిరెడ్డినాయక్, వరలక్ష్మి, ఉత్తేజ్ కుమార్, రవిశంకర్, నిరంజన్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు యశ్వంత్

స్టోరీ టెల్లింగ్ విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థి


అవార్డు అందుకుంటున్న విద్యార్థి

సంబేపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కళా ఉత్సవ్ కార్యక్రమా ల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టోరీ టెల్లింగ్ విభాగంలో జరిగిన పోటీల్లో సంబేపల్లె ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి యశ్వంత్‌రెడ్డి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. విజయవాడలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి నుంచి విద్యార్థి అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి స్టోరీ టెల్లింగ్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. తమ విద్యార్థి ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

'రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి'

మద నపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, అక్రమంగా రైస్‌మిల్లుల్లో నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా రైస్‌మిల్లుల్లో పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించాలన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అక్రమ రవాణా చేస్తున్నవారిపై పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభులు కృష్ణప్ప, సాంబశివ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, రెడి పాల్గొన్నారు.

జిల్లాల విభజన గాయం....

● అసంపూర్తిగా పీలేరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు
● రూ.26.50 లక్షల పెండింగ్ బిల్లులు ● చెల్లింపు నుంచి తప్పించుకుంటున్న అధికారులు

పీలేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సరళీకృతం అంటూ జిల్లాల పునర్విభజన చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తూ ఆగమేఘాలపై జిల్లాలను విభజించింది. రాజకీయ కోణంలో చేపట్టిన పునర్విభజనతో అనేక రకాల సమస్యలు తలెత్తాయి. ఇందులో భౌగోళికంగా కొన్ని సమస్యలుంటే కార్యాలయాల రూపంలో మరికొన్ని సమస్యలు జఠిలమయ్యాయి. అయితే విభజనలో చోటుచేసుకున్న మార్పుల్లో కొన్ని సమస్యలపై సరిహద్దు వివాదాలు మొదలయ్యాయి. ఈ కోవకు చెందినదే పీలేరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాల నిర్మాణాలు. పీలేరు మండలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్నప్పుడు ప్రారంభమైన ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాలు జిల్లాల విభజన తరువాత పూర్తిగా ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లా అధికారులు బిల్లులు చెల్లిస్తారని నూతన జిల్లా అధికారులు, నూతన జిల్లా అధికారులే చెల్లిస్తారని ఉమ్మడి జిల్లా అధికారులు బాధ్యతల నుంచి తప్పించుకుంటూ ఉండడంతో నిర్మాణ బాధ్యతలు చేపట్టిన పాఠశాల కమిటీ సభ్యులు పనులను సగంలోనే నిలిపివేశారు. దీంతో పాత పాఠశాలలోనే ఇరుకు గదుల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల విభజనతో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడం మాత్రం మరిచింది. తమ సమస్యలు పరిష్కరించమని బాధితులు ఎన్నిమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోలేదు.


అసంపూర్తిగా మిగిలిపోయిన నూతన భవనాలు

ఉర్దూ విద్యకు పెట్టింది పేరు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉర్దూ విద్యకు పేరెన్నిక గల ప్రాంతాల్లో పీలేరు కూడా ఒకటి. నాలుగు దశాబ్దాలుగా పీలేరులో ఉర్దూ పాఠశాల నడుస్తోంది. పీలేరు పరిసర ప్రాంతాలైన రొంపిచెర్ల, సదుం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పులిచెర్ల కేవీపల్లె మండలాల నుంచి చాలా మంది విద్యార్థులు పీలేరులోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో చదివేవారు. గాంధీ రోడ్డులో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఇరవై ఏళ్ల కిందట ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి వరకు ఏటా సుమారు 300 మంది విద్యార్థులు ఉర్దూ మాధ్యమంలో టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్, డిగ్రీ కోసం అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటికి వెళ్లేవారు. ప్రస్తుతం పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో 203 మంది విద్యార్థులు చదువుతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో ఉర్దూ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడే వారు. ఆ ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో 2018లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పథకం కింద ఐదు గదులు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

రూ.53 లక్షలతో అదనపు గదులు

రూ.53 లక్షల ఆర్ఎంఎస్ఏ నిధులతో ఉర్దూ ఉన్నత పాఠశాల కోసం ఐదు తరగతి గదులు నిర్మించేలా ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కమిటీకి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం పాత శాల ఉన్న గాంధీ రోడ్డులో తగినంత స్థలం లేక పోవడంతో రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో నిర్మాణాలు ప్రారంభించారు. తొలివిడత పాఠశాల ఖాతాలో రూ.23.50 లక్షల నిధులు కూడా జమయ్యాయి. పనులు జరిగే క్రమంలో పాక్షిక బిల్లుల చెల్లింపు ఉంటుందన్న అధికారుల భరోసాతో కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు. ఆ క్రమంలో 2022 వరకు రూ.23.50 లక్షల బిల్లుల చెల్లింపులు కూడా జరిగాయి. నిధులు వచ్చేస్తాయన్న విశ్వాసంతో కమిటీ సభ్యులు రూ.45 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. అయితే జిల్లాల విభజనలో పీలేరు మండలం అన్నమయ్య జిల్లాలోకి కలిపేశారు. ప్రభుత్వం. కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ ముగిసి పాలన గాడిలో పడిన తరువాత బిల్లుల చెల్లిస్తారని ఎదురుచూశారు. అయితే బాధ్యతలు చేపట్టిన కొత్త జిల్లా అధికారులు పాత పనుల గురించి తమకేమీ తెలియదని తేల్చి చెప్పేశారు.

బిల్లుల కోసం పరుగులు

బిల్లులు వస్తాయన్న నమ్మకం సన్నగిల్లడంతో ఉర్దూ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అటు చిత్తూరుకు, ఇటు రాయచోటికి పరుగులు పెట్టారు. 'మీ ఊరు కొత్త జిల్లాకు వెళ్లింది గనుక కొత్త జిల్లా వారే బిల్లులు చెల్లిస్తారు' అంటూ చిత్తూరు జిల్లా అధికారులు, 'పాత జిల్లా ఉన్నప్పుడు పనులు జరిగాయి కాబట్టి పాత జిల్లా వారే బిల్లులు చెల్లిస్తారు' అంటూ అన్నమయ్య జిల్లా అధికారులు సెలవివ్వడంతో కమిటీ సభ్యులు ఏం చేయాలో పాలుపోక నిర్మాణ పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వం కంటే మరిన్ని ఎక్కువ నిధులు మంజూరు చేయిస్తామంటూ అప్పటి ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు చెప్పిన మాటలు విని ఎక్కువ మొత్తంలో పనులు పూర్తి చేశారు. వారికి రావాల్సిన రూ.23.50 లక్షలకు అదనంగా మరో రూ.15 లక్షల దాకా రావాల్సి ఉందని కమిటీ సభ్యులు వాపోతున్నారు. బిల్లుల సంగతి తేల్చమని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని, జరిగిన నష్టం చాలని, ఇక తాము పనులు చేయలేమని వారు చేతు లెత్తేశారు. గత నెల 30వ తేదీన పీలేరుకు వచ్చిన డీఈఓ సుబ్రహ్మణ్యం దృష్టికి పాత శాల సమస్యను కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వారికి భరోసా కల్పించారు. తమ ఆశలన్నీ ఆయన మీదే ఉన్నాయని, తమ పాఠశాలకు రావాల్సిన బిల్లులు చెల్లిస్తే ఎలాగోలా పనులు పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రస్తుతం నడుస్తున్న భవనంలో కేవలం మూడు గదులు మాత్రమే తరగతి గదులు నిర్వహించేందుకు అనువుగా ఉంది. కూటమి ప్రభుత్వమైనా తమ పాఠశాలను పట్టించుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

479 కిలోల బియ్యం స్వాధీనం


బియ్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

సుండుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళకాలనీలో అక్రమంగా తరలిస్తున్న 479 కిలోల బియ్యం మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంపై బియ్యం తరలిస్తున్న జబ్బార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. బియ్యం అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వీఆర్వో బసయ్య పాల్గొన్నారు.

హోటల్‌లో చోరీ

సంబేపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై మోటకట్ల శివాలయం పక్కన ఉన్న స్టార్ హోటల్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు హోటల్ యజమాని ముక్తా నాగేశ్వర తెలిపారు. బాధితుడి వివరాల మేరకు... సోమవారం రాత్రి హోటల్‌లో పని ముగించుకుని తాళాలు వేసి పక్కనే ఉన్న ఇంట్లో పడుకున్నారు. మంగళవారం ఉదయం హోటల్ తెరవడానికి వచ్చేసమయానికే వాకిలి తెరుచుకుని ఉంది. దుండగులు బ్లేడుతో చిలుకును కోసి వెనుక వైపు వాకిలి తెరిచి చోరీకి పాల్పడ్డారు. రూ.45 వేలు నగదు, గ్యాస్ సిలిండర్, మిక్సీ, వంట పాత్రలు, బియ్యం, సరుకులు తీసుకెళ్లినట్లు వాపోయారు. మొత్తం లక్ష రూపాయలకు పైన నష్టం జరిగినట్లు తెలిపారు. సంబేపల్లె పోలీసులకు చోరీపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఒక ఇంటి వద్ద ఉన్న వాషింగ్ మిషన్ రెండు రోజుల కిందట చోరీకి గురైంది. వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

యువతిని కాపాడిన పోలీసులు

ఒంటిమిట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న యువతిని పోలీసులు కాపాడారు. సుండుపల్లె మండలం సాకినే బండకు చెందిన ఓ యువతి మంగళవారం సాయంత్రం రైలుపట్టాలపై అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ఎస్ఐ శివప్రసాద్‌కు సమాచారం తెలిపారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది యువతిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రేమ వ్యవహారంలో మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నిసున్నట్లు తెలపడంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ చదువుతున్నానని చెప్పడంతో సిబ్బందితో కలిపి కళాశాలకు పంపామన్నారు. యువతి మానసిక స్థితి కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు నాటు సారా స్వాధీనం

- నలుగురి అరెస్టు


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు


ములకలచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధి ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల్లో ఎక్సైజ్ పోలీసులు, స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వేపూరికోటలో వేర్వేరు చోట దాడులు నిర్వహించి 81 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 24 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని అంజనప్ప, శివయ్యను అరెస్టు చేశారు తంబళ్లపల్లె మండలం కోటకొండలో 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అప్పనాయక్‌ను అరెస్టు చేశారు. రెడ్డికోటలో దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఈశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. సీఐ మాధవి కడప ఎన్‌ఫోర్స్‌మెంట్, రాయచోటి డీటీఎఫ్ సీఐలు పాల్గొన్నారు.

చుట్టూ ఎత్తైన కొండలు.. కనుచూపు మేర సముద్రాన్ని తలపించేలా బ్యాక్‌వాటర్.. సొరంగ మార్గం ద్వారా వరదలా వచ్చి చేరే కృష్ణా జలాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. పెన్నా, చిత్రావతి నదుల సంగమం.. రెండు కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో నిర్మితమైన గండికోట ప్రాజెక్టు దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడటంతో పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా.. అభివృద్ధికి బాటలు వేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

గండికోట ప్రాజెక్టు ముఖద్వారం



గండికోట ప్రాజెక్టుకు పర్యాటక శోభ ఏదీ..!


రెండు కొండల మధ్య కనువిందు చేసున్న గండికోటప్రాజెక్టు

- టూరిజం దిశగా అభివృద్ధి చెందని వైనం
- కూటమి ప్రభుత్వంలోనైనా.. అభివృద్ధి చెందేనా!

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. ప్రస్తుతం పూర్తి నీటి సామర్థ్యంతో నిండుకుండలా ఉంది. 26.85 టీఎం సీల సామర్థ్యంతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు కరువు బారిన పడకుండా జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటోంది. కృష్ణా జలాలతో

చూపరులను ఆకట్టుకునే గండికోట వెనుకజలాలు



కల కలలాడుతూ దర్శనమిస్తున్న గండికోట జలాశ యాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన గత వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు.

గండికోట ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ ద్వారా కృష్ణాజలాలు చేరుతాయి. ప్రాజెక్టులోకి నీళ్లు చేరేందుకు కొండలు అడ్డం ఉండటంతో సొరంగాన్ని నిర్మించారు. మైలవరం మండలం లింగాపురం నుంచి గండి కోట ప్రాజెక్టు వరకు 5.5 కిలోమీటర్లు సొరంగాన్ని నిర్మించారు. ఈ సొరంగ మార్గం ద్వారా కృష్ణాజలాలు గండికోటలోకి చేరుతాయి. ఈ దృశ్యం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. కాగా, ప్రాజెక్టు కింద 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ముంపు ప్రాంతంలో బ్యాక్‌వాటర్‌తో కృష్ణా జలాలు కనువిందు చేస్తున్నాయి.

బోటింగ్ ఏర్పాటు చేస్తే ...

గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే బోటింగ్ ఏర్పాటు తప్పనిసరి. ఇప్పటికే మైలవరం జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేసినా, దానికంటే పెద్దదైన గండికోట ప్రాజెక్టులో ఇంత వరకు బోటింగ్ కూడా ఏర్పాటు చేయ కపోవడం గమనార్హం. సర్ ఆర్థర్ కాటన్ మనవడు రాబర్ట్ కాటన్‌తో పాటు పలువురు గండికోట ప్రాజెక్టును సందర్శించి ప్రాజెకు ప్రాంతంలో అందాలను చూచి మైమరచిపోయారు.

కూటమి ప్రభుత్వంలో... అభివృద్ధి చెందేనా

గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి


గండికోట ప్రాజెక్టు నుంచి వివిధ ప్రాజెక్టులకు నీరు వెళ్లే మెయిన్‌కెనాల్


గండికోట ప్రాజెక్టును సందర్శించిన సర్ ఆర్థర్ కాటన్ మనవడు రాబర్ట్‌కాటన్ తదితరులు (ఫైల్‌ఫోటో)

ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గండికోట ప్రాజెక్టు ప్రాం తంలో రిసార్ట్‌లు, వెనుక జలాల్లో బోటింగ్ సౌక ర్యం, వ్యూపాయింట్లు వంటి వాటిని ఏర్పాటు చేసే ందుకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవ కాశాలు పుష్కలంగా ఉన్నాయి.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- లారీని ఢీ కొట్టిన మరో లారీ
- భారీగా స్తంభించిన ట్రాఫిక్


ప్రమాదానికి గురైన లారీలు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి గురైన లారీలు రోడ్డు మధ్య ఉండడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ జయరాములు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నంద్యాల నుంచి కోడూరుకు లోడ్‌తో వెళుతున్న లారీని.. రాజంపేట నుంచి కడప వైపుగా వస్తున్న మరో లారీ కడప సెంట్రల్ జైలు వద్దకు రాగానే గుంతను తప్పించబోయి ఢీ కొంది. ప్రమాదంలో ఇరువురు లారీ డ్రైవర్లకు ఎలాంటి గాయాలు తగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కుందూ నదిలో పడి యువకుడి మృతి



చాపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాపాడు గ్రామానికి చెందిన పూజారి మహేష్‌బాబు (32) అనే యువకుడు కుందూనదిలో పడి మృతి చెందా డు. సురేష్‌బాబు ఈనెల 9న సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కాలకృత్యాల కోసం గ్రామం ఆనుకుని ఉన్న కుందూ నది వద్దకు వెళ్లి నీటిలో కారుజారి పడిపోయాడు. అప్పటికే చీకటి పడడంతో ఎవరు ఈ ప్రమాదాన్ని గమనించలేదు. మంగళవారం ఉదయం అతని అన్న లక్షుమయ్య తమ్ముడి ఆచూకీ కోసం నది వద్దకు వెళ్లి చూడగా చాకలి రేవు వద్ద మృతదేహం ఉన్న విషయాన్ని గుర్తించారు. సురేష్‌బాబుకు మానసిక పరిస్థితి కూడా బాగలేదు. ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. లక్షుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాయచోటి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండ గా ద్విచక్ర వాహనం ఢీకొన డంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు రాయచోటి పట్టణంలోని మాసా పేటకు చెందిన కత్తి అంకయ్య (76) పట్టణ పరిధిలోని మదనపల్లి రోడ్డులో శ్రీనివాసపురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అంక య్యను స్థానికులు రాయచోటి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ



ముద్దనూరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయబోర్లకు సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీకి గురై నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. సోమవారం చింతకుంట గ్రామానికి చెందిన చంద్రమోహన్, కమ్మవారిపల్లెకు చెందినసంజీవగాళ్ల వీరమ్మకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగలగొట్టి.. అందులోని కాపర్ వైరు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

తాగునీటి మోటర్లలో వైర్లు..

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత తాగునీటి మోటర్లకు సంబంధించిన వైర్లను దొంగలు చోరీ చేశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5గంటలకే తాగునీటిని ప్రజలకు అందించేవారు. అయితే మంగళవారం ఉదయం పంచాయతీ సిబ్బంది మోటర్ల వద్దకు వెళ్లగా కేసీ కెనాల్ కట్టపై, మద్దిమాను వద్ద ఉన్న తాగునీటి మోటార్ల వైర్లు కోసుకెళ్లినట్లు గమనించారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : అదనపు ఎస్పీ

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాష్‌బాబు అన్నారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా ప్రమాదానికి గురై కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ నాగార్జునరెడ్డి మృతి చెందాడు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నాగార్జునరెడ్డి సతీమణి బి.లక్ష్మీకాంతమ్మకు ఏఎస్పీ రూ.2.5 లక్షల చెక్‌ను ఆర్థిక సాయం కింద అందజేశారు. అనంతరం ఏఎస్ఐ కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని.. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీపీవో ఏఓ జ్యోతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్ఐ భార్యకు చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు ఒకరి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడిన యువకుడు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఐటిఐ సర్కిల్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు ఫాతిమా కాలేజ్ సమీపంలోని ఫంక్షన్‌కు పల్సర్ బైకుపై వెళుతున్నారు. ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్దకు రాగానే పార్కింగ్ చేసిన వాహనాన్ని వేగంగా వచ్చిన బైకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైకు నడిపిన యువకుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇరువురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలానికి తాలుకా పోలీసులు చేరుకొని ప్రమాద ఘటనను పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైకును ఢీకొన్న కారు.. వ్యక్తికి గాయాలు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద బైకును కారు ఢీకొనడంతో బైకులో వెళుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలోని దొమ్మరనంద్యాలకు చెందిన వినయ్ కుమార్ బైకులో సొంత పని నిమిత్తం కడపకు వచ్చారు. రిమ్స్ ఆసుపత్రి సమీపంలోని రింగ్ రోడ్డుపై వెళుతుండగా కారు వచ్చి ఢీకొనడంతో వినయ్‌కుమార్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి - కేసు నమోదు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ కాలనీలో మంగళవారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆర్టీసీ కాలనీకి చెందిన దామోదర్ రమణల మధ్య మాటమాట పెరిగి ఘర్షణ పడ్డారు. దామోదర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రమణపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు తెలపవచ్చు

- సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిటీకి అభిప్రాయాలను తెలపవచ్చని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 1న భారత అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు కులాల్లోని ఉప వర్గీకరణ కోసం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో వన్‌మ్యాన్ కమిటీని నియమించిందని తెలిపారు. సంబంధిత ఏకసభ్య కమిషన్ కార్యాలయం గిరిజన ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు కోనేరు లక్ష్మయ్యవీధి, మొగల్రాజపురం, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ విషయంపై ఏదైనా సంతకంతో కూడిన రాతపూర్వక మెమొరాండం, రెప్రజెంటేషన్లు కార్యాలయం పనివేళల్లో జనవరి 9 వరకు స్వయంగా కానీ, రిజిస్టరు పోస్టు ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఈ మెయిల్ ఐడీ ఓఎంఎస్‌సీ సబ్ క్లాసిఫికేషన్ డాట్ కామ్ ద్వారా కూడా తెలపవచ్చని ఆమె తెలిపారు.

మానవహక్కులకు భంగం కలిగితే సహించే ప్రసక్తే లేదు

- ఎస్ఎస్‌జేఐసీ హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడైనా మానవహక్కులకు భంగం కలిగితే సహించే ప్రసక్తే లేదని షా సోషియల్ జస్టిస్ ఫర్ ఇంటర్‌నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ షా మహ్మద్ స్పష్టం చేశారు. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడితే వారి హక్కుల పరిరక్షణ కోసం తాము అక్కడ వుంటామన్నారు. 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆ కౌన్సిల్ ఏపీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సుంకేసుల బాదుల్లా అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలందరికీ సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు కలదన్నారు. అలాంటి హక్కును కొంతమంది పనిగట్టుకుని హరించాలని చూడడం సరైంది కాదన్నారు. అనంతరం కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన అలీషేర్‌ను నియమించారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్, ప్రజాసంఘాల నాయకులు నజీర్‌అహ్మద్, మన్సూర్ అలీఖాన్, తాహిరుల్లా ఖాద్రి, పి.పెద్దన్న, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు.

కారుణ్య నియామక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కడప రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాలకు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు మొత్తం నలుగురు అభ్యర్థులు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల పోస్టులు ఖాళీగా లేకపోవడంతో వీరికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను రోస్టర్ పాయింట్ల ప్రకారం త్వరలో కేటాయిస్తామని జడ్పీ సీఈవో తెలిపారు. ఉద్యోగం చేస్తున్న కుటుంబ పెద్ద మరణించడంతో అర్హులైన కుటుంబంలో ఒకరికి వీలైనంత త్వరగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనలో పరిపాలనాధికారి(ఏవో) భాస్కర్‌రెడ్డి, స్టెనో శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అస్వస్థత

- ఆస్పత్రికి పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థుల్లో కొందరు గత నాలుగైదు రోజులుగా విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. రోజుకు 40 నుంచి 50 మంది ఆస్పత్రికి వస్తున్నట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలోని పాత క్యాపస్‌లో చదువుతున్న ఒంగోలు విద్యార్థులకు ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. బయటి నుంచి ఆహారం తెప్పించుకోవడం వల్ల గానీ, మెస్‌లో భోజనం సక్రమంగా లేకపోవడమో, నీళ్లలో కోతులు తిరగడమో కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మానవహక్కులు భవిష్యత్‌కు మార్గదర్శకాలు

- డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మానవహక్కులు భవిష్యత్‌కు మార్గదర్శకాలు అని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను నిర్దేశించినవన్నారు. జాతి, లింగ, వర్ణ, కుల, మత రాజకీయ ఏ విధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలను, ఉచిత న్యాయ సహాయాన్ని, లీగల్ సర్వీసెస్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పి.హరిబాబు, ఎం.శాంత, పి. మనోహర్, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథాలయానికి రూ.3.32 లక్షల ఆదాయం



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

నందలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయానికి హుండీలోని కానుకల ద్వారా రూ.3,31,968 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. నెల రోజుల తర్వాత మంగళవారం హుండీలోని కానుకలు లెక్కించామన్నారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్స్ అధికారి జానకిరాం పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం'లో మెనూ తప్పనిసరి



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

సంబేపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. సంబేపల్లె మండం ప్రకాశ్‌నగర్‌కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పనివేళలు పాటించాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ తప్పనిసరి అన్నారు. చిక్కీ, గుడ్డు, రుచికరమైన భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు జయనారాయణరెడ్డి మంత్రిని శాలువాతో సన్మానించారు.

రామాలయం ప్రారంభం

మండలంలోని గుడియవాండ్లపల్లె హరిజనవాడలో రాళ్లపల్లి రమేశ్‌నాయుడు ఆర్థిక సహకారంతో నిర్మించిన రామాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నారా ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు రాళ్లపల్లి వేణుగోపాల్‌నాయుడు, రాళ్లపల్లి రెడ్డెయ్యనాయుడు, రవీంద్రనాయుడు, కిశోర్‌నాయుడు, పుల్లయ్యనాయుడు, రమేశ్‌నాయుడు, వక్కలగడ్డ రమేశ్‌నాయుడు, రాహుల్ నాయుడు, నాగేశ్వర్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

సుండుపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యా ర్థులు వందశాతం ఉత్తీ ర్ణత సాధించాలని డిప్యూ టీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు జీకే రాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. త్వరగా సిలబస్ పూర్తి చేసి ప్లానింగ్ ప్రకారం చదివేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు. పాఠాలు అర్థం కాకపోతే మళ్లీ అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్య డునాయక్, ప్రధానోపాధ్యాయుడు అమృనాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల మాటున భూ దోపిడీ

● టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థల మాటున భూములు ఆక్రమిస్తున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రాజంపేట పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పోలి శివ కుమార్, డిమాండ్ చేశారు. మంగళవారం రాజంపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాజంపేటలో విద్యాలయాల మాటున చెరువులను, ఇతర ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకున్నారన్నారు. రాజంపేట మండలం బోయనపల్లెలో ఓ విద్యా సంస్థ పేరుతో సర్వే నంబరు 1080లోని చెరువు భూమిన్ని కబ్జా చేశారన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన వేలాది ఎకరాల భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నేతలు బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్ల కబ్జాపై ఫిర్యాదు

పుల్లంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై రహదారి పక్కనే ఉన్న సా మూహిక మరుగుదొడ్ల స్థలా న్ని కబ్జా చేసి రిజిస్టర్ చేసు కున్నారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పుత్తన వారిపల్లెకు చెందిన దొంతు నాగభూషణం రెవెన్యూ సదస్సు లో ఫిర్యాదు చేశారు. మంగళవారం పుత్తనవారిపల్లె సచివాలయంలో నోడల్ అధికారి కృష్ణారావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ గ్రామంలోని సామూహిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో, ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేసి దొంగ పత్రాలు సృష్టించి రిజిస్టర్ చేసుకున్నారని, ఈ విషయం పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలని ఆయన ఆదేశించినా ఇంతవరకు ఎందుకు రద్దు చేయలేదన్నారు. పుత్తనవారిపల్లె కుంట ఆక్రమణకు గురైందని, సర్వే చేయాలని గ్రామానికి చెందిన నరేష్ ఫిర్యాదు చేశారు. ఈ సదస్సులో 35 అర్జీలు వచ్చాయి.

రెవెన్యూ సదస్సులో వాగ్వాదం

ఒంటిమిట్ట : సర్వేనంబరు 20లోని 2.5 ఎకరాల చుక్కల భూమి తమ ఆధీనంలో ఉందని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని నడింపల్లెకు చెందిన బిల్లా లక్ష్మీనరసయ్య పోను బుచ్చయ్యగారిపల్లె రెవెన్యూ సదస్సులో తహసీల్దారు రమణమ్మకు అర్జీ అందజేశారు. ఆ భూమి తమ పూర్వీకుల నుంచి తమ అనుభవంలో ఉందని రామచంద్రారెడ్డి అనే వ్యక్తి అభ్యంతరం తెలపడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై విచారణ చేసి న్యాయం చేస్తామని తహసీల్దారు ఇరువురిని శాంతింపజేశారు.

అడవుల అభివృద్ధికి సహకారం అవసరం

ఒంటిమిట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అడవుల అభివృద్ధికి గ్రామస్థుల సహ కారం అవసరమని ఇన్‌చార్జి డీఎఫ్‌వో రాజశేఖర్ బాబు అన్నారు. మంగళవారం రాత్రి అటవీశాఖ అధికారులు, సిబ్బంది చింతరాచపల్లెలోని దాసరదొడ్డి బీట్‌లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ ఉత్పత్తుల అభివృద్ధి వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎర్రచందనం అక్రమ రవాణాతో భావి తరాలకు ఉపయోగపడే సహజ వనరులు మానవుడికి దూరమవుతున్నాయని వివరించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి రేంజర్ బాలసుబ్రమణ్యం, ఎఫ్ఎస్‌వో బ్రహ్మయ్య, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు తుంగా మునెయ్య మృతి

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత తుంగా మునెయ్య(90) మంగళవారం చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పెనగలూరు మండలం కాకర్ల వారిపల్లెకు చెందిన ఆయన 1945 నుంచి పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. అనేక ఉద్య మాల్లో కీలకపాత్ర పోషించారు. సీపీఐ రాష్ట్ర స్థాయి నాయకుడు టి.లక్ష్మీనారాయణ, అన్నమయ్య జిల్లా సీపీఐ నాయకుడు మ హేష్, మైనార్టీ నేత ముజఫర్ అహ్మద్ తదితరులు సంతాపం తెలియజేశారు. ఆయన మరణం సీపీఐకి తీరని లోటు అని వ్యాఖ్యానించారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతో మామిడిలో మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన శాఖ అధికారి నాగవేణి తెలిపారు. మంగళవారం కుర్నూతల, పందిళ్లపల్లెల్లో మామిడి రైతుల కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25లో మామిడి తోటలకు ప్రభుత్వం పంటబీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు. మామిడి రైతులు ఎకరాకు రూ. 2,250 ప్రీమియం చె ల్లిస్తే రూ. 45 వేల బీమా వర్తిస్తుందన్నా రు. మామిడి తోటలు ఉన్న రైతులు ఈ నెల 15లోపు మీసేవ కేంద్రంలో ప్రీమియం చెల్లించి నమోదు చేయించుకోవాలన్నారు. ఏడీఏ జయరాణి మాట్లాడుతూ రబీలో వేరుశనగ, ఇతర పంటలు సాగుచేసిన రై తులు బిందు సేద్యం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమేష్‌బాబురావు, డీ ఆర్‌సీ సుచిత్ర, ఏఈఓలు కెరోలిన్, అనూష, ఆర్‌బీకే సిబ్బంది కీర్తి, సౌజన్య, మామిడి రైతులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ విజయంపై యూటీఎఫ్ హర్షం

నందలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమంది సామాన్య ఉపాధ్యాయులను యూటీఎఫ్ చట్టసభలకు పంపిందని నందలూరు నాయకులు షేక్ రౌఫ్‌బాషా, వై.మస్తాన్‌రెడ్డి, కె.రమేష్, ఎం.హరినాథ్ తెలిపారు. మంగళవారం ఉభయగోదావరి అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపు 4 వేల ఓట్ల మెజారిటీతో బొర్రా గోపిమూర్తి గెలుపొందడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక నందలూరు హైస్కూల్లో మిఠాయిలు పంచారు.

ఈ కార్యక్రమంలో జి.కృపానందం, వి.సుధాకర్, కొండమూర్తి, టి.రామక్రిష్ణ, ఆనంద్, ఇమామ్‌బాషా, నారాయణ, రెడ్డన్న, కిరణ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చిన్నమండెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, డీపీఎం ప్రవీణ్ పిలుపునిచ్చారు. మంగళవారం కేశాపురంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టమోటా, మామిడి, వేరుశనగ పంటలకు డిసెంబరు 15లోగా, వరికి 31లోగా ప్రీమియం చెల్లించాలని, టమోటాకు ఎకరాకు 1600, మామిడికి ఎకరాకు 2250, వేరుశనగకి 96, వరికి 196 రూపాయలు చెల్లించి పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి గీత, ప్రకృతి మండల కోఆర్డినేటర్ చందురెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పావని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రామాపురం: ప్రతి రైతు పంట బీమా చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లిలో మంగళవారం ఆయన రైతులతో మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆఫ్ ఇండియా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు ఈ బీమా అవకాశం కల్పిస్తుందన్నారు. ఎకరాకు రూ.2500 ప్రీమియం చెల్లిస్తే 45 వేల బీమా వర్తిస్తుందన్నారు. డిసెంబరు 15 లోపల పాసు పుస్తకం, రైతు సేవా కేంద్రం నుంచి పంట సాగు ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు వివరాలతో మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రైతులు శివారెడ్డి, రవిరెడ్డి, గంగిరెడ్డి, మదన, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

రాయచోటి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, బోధన కుంటుపడకుండా చూడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపులేటి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకుల పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే విద్యావ్యవస్థ ప్రైవేటీకరణ అయిపోయిందని, ప్రభుత్వ విద్య పరిరక్షించాలంటే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే మార్గమన్నారు. సిబ్బంది కొరత కారణంగా విద్యార్థు లకు కనీస సౌకర్యాలు అందడం లేదన్నారు. వెంటనే గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, రాయ చోటి నియోజకవర్గ కార్యదర్శి కార్తీక్ నాయక్, నాయకులు సంతోశ్‌నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్



పోలింగ్ సామగ్రి పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి దయానందం

పెనగలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 15 సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని జి. దయానందం తెలిపారు. సింగనమల, గోవిందంపల్లె, పెనగలూరు, ఓబిలి, వెలగచర్ల చెరువులతోపాటు, కొండూరు పడమర, తూర్పు, నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లె, సిద్దవరం, ఓబిలి, సింగారెడ్డిపల్లె, ఇండ్లూరు, తిరు మలరాజుపేట, ఊట కాలువలకు ఆయా గ్రామ సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో నోటిఫికేషన్ విడుదల చేసి ఓటర్ల జాబితాను ప్రజలకు తెలియ జేస్తామన్నారు. నామినేషన్, ఎన్నిక, ఫలితాల విడుదల తదితర వివరాలను టాంటాం, మైకు, దండోరా ద్వారా తెలుపుతామన్నారు. మండలంలోని అన్ని సాగునీటి సంఘాల్లో 337 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

'సంఘ విద్రోహ శక్తులు భారీ మూల్యం చెల్లించక తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న జనసైనికులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను చంపేస్తామని బెదిరించిన సంఘ విద్రోహ శక్తులు భారీ మూల్యం చెల్లించక తప్పదని జన సైనికులు హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పవన్ కళ్యాణ్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ ప్లస్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నార్జల దాశరథి, యానాదయ్య, ముద్దపోలు రామసుబ్బయ్య, ఉత్తరాది శివకుమార్, అంకిశెట్టి మణి, చెన్నంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవైపై అవగాహన కల్పించండి



మున్సిపల్ కమిషనర్‌తో చర్చిస్తున్న సాయిలోకేష్

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలకు గూడు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజనను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ రాజంపేట మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన మున్సిపల్ కమిషనర్‌తో సమా వేశమయ్యారు. ఇప్పటివరకు రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో కేవలం 34 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోవడం బాధాకరమన్నారు. ఇటు మున్సిపల్ అధికారులు, అటు మండల అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఈ పథకం ఆవశ్యకతను వివరించాలన్నారు. పేదలు నిర్మించుకునే ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం రూ. 2.50 లక్షలు మంజూరు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, కార్యదర్శి సమ్మెట నరేంద్రరాజు, రమణయ్య, శ్రీనివాసులు, సుబ్బారావు, ఆర్‌ఐ హరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రామాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన వీరపోగు శివశంకర్ సోమవారం రాత్రి రావులపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా డాల్ఫిన్ దాబా వద్ద లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్సై వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఆటో బోల్తా : 8 మందికి గాయాలు

పుల్లంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై.జంక్షన్ వద్ద కడప-చెన్నై జాతీయ రహదారిలో ఆటో బోల్తా పడిన సంఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన 11 మంది మైదుకూరులోని తమ బంధువుల ఇంటిలో పెద్దకర్మకు హాజరై ఆటోలో తిరిగి వస్తుండగా పుల్లంపేట వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ షరీఫ్ తీవ్రంగా గాయపడగా మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైభవంగా హజరత్ ఖాదర్‌వలి దర్గా ఉరుసు



ప్రార్థనలు చేస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హజరత్ ఖాదర్‌వలి దర్గా ఉరుసు సందర్భంగా సోమవారం రాత్రి గంధం ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిది వేడా విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. దర్గా కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన దర్గాలో ప్రార్థనలు చేశారురు. అనంతరం రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్ర మంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, దార్ల సురేష్, జంబు రవి తదితరులు పాల్గొన్నారు.

వైబీఎన్ పల్లెలో బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

రాజంపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని వైబీఎన్ పల్లెలో మంగళ వారం బీజేపీ బూత్‌కమిటీ ఎ న్నిక నిర్వహించారు. ఆ గ్రామ బూత్‌కమిటీ అధ్యక్షుడిగా మలి శెట్టి సురేష్, సభ్యులుగా నాగేశ్వరరావు, వేణుగోపాల్, రమేష్ బాబు, నరసింహులునాయుడు, కృష్ణయ్య, వెంకట్, హేమంత్, చంద్రమౌళి, బాలకృష్ణ, సుబ్బరాయుడును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణ, మండల కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కానున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

● రైల్వే ప్రయాణికులు, ఎర్రగుంట్ల వాసులకు ఊరట

ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందించిన రైల్వే అధికారులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణీకులు, ఎర్రగుంట్ల వాసులు కల ఫలించినట్లైంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. వృద్ధులు, వికలాంగులు, భారీ లగేజీ ప్రయాణీకులు, రాత్రిళ్ల స్త్రీల భయాలకు తెర పడనుంది. ఆంధ్రజ్యోతి కథనాలపై రైల్వే అధికారులు స్పందించిన వివరాల్లోకెళితే...

పెరిగిన రైళ్ల వేగంతో నిబంధనలు అనుసరించి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ నిర్మించడంతో స్టేషన్‌లోపలికి వెళ్లేందుకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, భారీ లగేజీ, చిన్నారులతో వచ్చే ప్రయాణికుల పరిస్థితి దారుణం. రాత్రి పూట స్త్రీలు రావాలంటేనే భయపడేవారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రొద్దుటూరుకు వెళ్లేందుకు, ఉత్తరం వైపున్న పోస్టాఫీసు, దక్షిణం వైపున్న నగర పంచాయతీ కార్యాలయం, కాలేజీలు, బస్టాండు, బ్యాంకులు, అవసరాల కోసం రాకపోకలకు ఒకటిన్నర కిలోమీటర్ దూరం తిరిగి రాలేక రైల్వేస్టేషన్ నుంచే వచ్చే వారు. దీంతో ప్రహరీ ఎక్కి దిగే ప్రయత్నాల్లో ఒకరు మృతి చెందగా, మరికొందరు వికలాంగులుగా మారారు. రెండు ప్లాట్ ఫారాలను కలుపుతూ నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దక్షిణం వైపున ప్రయాణికులు గ్రామంలోకి వెళ్లేందుకు పొడిగించారు. అయితే గతంలో రైల్వేస్టేషన్ ఫుట్‌ఓవర్ పక్కనే వుండడంతో ఉత్తరం వైపు పొడిగించలేదు. రైళ్లు దిగిన ప్రయాణికులు అధికభాగం ఉత్తరం వైపున్న ప్రొద్దుటూరు, ఇతర గ్రామాలకు వెళ్లేం దుకు బస్సుల కోసం వెళ్తారు. దీంతో ప్లాట్ ఫారాలపై దిగిన ప్రయాణికులు తప్పక రైల్వే స్టేషన్‌లోకి వెళ్లి తిరిగి బయటికి రావాల్సిన పరిస్థితి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రహరీ బయటికి ఉత్తరం వైపు ప్రొద్దుటూరు రోడ్డులోకి వెళ్లేందుకు అనువుగా



ఉత్తరం వైపు పొడిగించాల్సిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

నిర్మించాలని అనేక సార్లు వినతులు వెళ్లాయి. సంతకాల సేకరణ కూడా చేపట్టి డీఆర్ఎం, జీఎం స్థాయి అధికారుల దృష్టికి ప్రయాణికుల అవస్థలను ఆంధ్రజ్యోతి తీసుకెళ్లింది. డీఆర్ఎం మనీష్ అగర్వాల్ దృష్టికి కూడా తీసుకెళ్లగా ఆయన నేరుగా పరిశీలించి వెంటనే స్పందించారు. బ్రిడ్జి ఆవశ్యకతను గుర్తించి టెండర్లు పిలిచి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేశారు. టెండర్లు పూర్తయి నాలుగు నెలలవుతున్నా డిజైన్ కోసం సికింద్రాబాద్‌లో జాప్యం జరిగిందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవల ఎర్రగుంట్లకు వచ్చిన డీఆర్ఎం విజయకుమా ర్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో ఆయన కూడా స్పందించారు. పదిరోజుల్లో కచ్చితంగా నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చినట్లు వచ్చే వారంలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఐఓడబ్లు అధికారులు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీంతో ప్రయాణికుల, ఎర్రగుంట్ల ప్రజల అవస్థలు తీరనున్నాయి.

18మంది గంజాయి విక్రేతలు అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ కొండయ్య నాయుడు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు తదితరులు

మదనపల్లె అర్బన్, డిసెంబ రు 10(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణలో భాగంగా మదనపల్లె డివిజన్‌లో పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తూ, వాడుతున్న 18 మంది నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు ప్రకటించారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ కార్యాలయంలో మీడియా సమావేశంలో డీఎస్పీ అరెస్టు చూపి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు పుంగనూరు చెందిన వ్యక్తిగా వివరాలు సేకరించామని, త్వరలోనే అతన్ని అరెస్టు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. మిగిలిన తొమ్మిదిమందికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. 18మంది గంజాయి విక్రేతల వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, భగత్‌సింగ్ కాలనీ వాసి ఆవుల నరసింహులు, నరసింహులు భార్య ఆవుల రెడ్డెమ్మ, ఆవుల చిన్నయ్య, మదనపల్లె పట్టణం, మాయా బజార్ వాసి రామిశెట్టి హర్ష వర్ధన్, త్యాగరాజవీధికి చెందిన కార్తీక్ పవన్, కోళ్లబైలు పంచాయతీ బాబు కాలనీకి చెందిన గాలిగొట్టి బాల కృష్ణారెడ్డి వన్‌టౌన్ పరిధిలో ఉన్నారు. చంద్రాకాలనీకి చెందిన ఆవుల లక్ష్మయ్య, పుంగనూరు మండలం భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఎరుకుల రమణమ్మ, మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జబరు న్నీసా (ఆప), మదనపల్లె రాంనగర్‌కు చెందిన జి. సైఫుల్లా, మాయా బజార్‌కు చెందిన బొమ్మలేరు నరసింహులు టూ టౌన్ స్టేషన్ పరిధిలో ఉన్నారు. ముదివేడు పీఎస్ పరిధికి చెందిన కురబల కోట మండలం, అంగళ్లు పంచాయతీ ఆర్అండ్‌బీ కాలనీకి చెందిన గుర్రకొండ మహమ్మద్ రఫీ, అదేకాలనీకి చెందిన ఉల్లిభారతి, అంగళ్లకు చెందిన పఠాన్ ముజీబ్‌ఖాన్, మదనపల్లె పట్టణం, జీఎం నగర్‌కు చెందిన కె. నవీన్‌కుమార్, తంబళ్లపల్లె మండలం, మట్లివారిపల్లెకు చెందిన ప్రశాంత్ కుమార్‌రెడ్డి, కలకడ మండలం, బాలయ్యగారిపల్లెకు చెందిన షేక్ సురజ్ బాషాగా గుర్తించారు. కార్యక్రమంలో మదనపల్లెలోని వివిధ పోలీసు స్టేషన్ సీఐలు రిరిసావలి, రామచంద్ర, కళా వెంకట రమణ, రమేష్, ఎస్ఐలు హరిహరప్రసాద్, రహిముల్లా, దిలీప్ కుమార్, శివకుమార్, బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి గంజాయి అమ్ముతున్న తాగుతున్న నిందులను అదుపులోకి తీసుకున్నారు.

వీరి నుంచి నాలుగన్నర కిలోల గంజాయి, ఒక మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నా రు. దీని విలువ రూ. 1లక్ష 30 వేలు, ఉంటుందన్నారు. ప్రతిభ కనపర్చిన ఎస్ఐలు హరి హరప్రసాద్, రహిముల్లా, దిలీప్‌కుమార్, శివకుమార్, కానిస్టేబుల్స్ పురుషోత్తమ, చంద్రప్ప కు రివార్డుల కోసం ఉన్నతాధికారుల కు సిఫార్స్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రం - జ్యోతిక్షేత్రం

భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం అవధూత కాశిరెడ్డి నాయన

14,15 తేదీల్లో 29వ ఆరాధనోత్సవాలు ● ముమ్మర ఏర్పాట్లలో నిర్వాహకులు



కాశినాయన డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటూ వచ్చిన వారికి కడుపు నిండా అన్నం పెట్టిపంపే అవదూత కాశిరెడ్డి నాయన సమాధి నిష్టవహించిన జ్యోతిక్షేత్రం భక్తులకు కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఎత్తైన నల్లమల కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. పచ్చని పచ్చిక పరిచినట్లున్న ప్రాంతం పర్యాటకులు, భక్తులను ఆకట్టుకుంటోంది. జ్యోతిక్షేత్రంలోని కాశినాయన పాలరాతి సమాధిని దర్శించుకుంటే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పుణ్యక్షేత్రాల పర్యటనకు వచ్చే యాత్రికులు సైతం జ్యోతిక్షేత్రాన్ని దర్శించుకుని వెళతుంటారు. ఎంతో దివ్యక్షేత్రంగా విరాజిల్లే జ్యోతిక్షేత్రంలో కాశిరెడ్డినాయన 29వ ఆరాధనోత్సవాలు 14, 15 తేదీల్లో వేడుకగా నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వివరాల్లోకెళితే...

కాశిరెడ్డి నాయన నేపథ్యం

నెల్లూరు జిల్లా సీతారామాపురం మండలం బెడుసుపల్లెలో మున్నెల్లి కాశమ్మ, సుబ్బారెడ్డి పుణ్య దంపతుల రెండవ సంతానం కాశినాయన. ఆయన అసలు పేరు మున్నెల్లి కాశిరెడ్డి. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక భావాలు కల్గిన కాశిరెడ్డి నాయన గురువు అతిరాచ గురవయ్య భావాలకు ప్రభావితు డై ఆధ్యాత్మిక చింతనతో కాశి నుంచి కన్యాకుమారి వరకు పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ ముందుకు సాగాడు. ఇందులో భాగంగా కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో పాడుబడిన అనేక దేవాలయాలను పునర్నిర్మించి గోశాలలు, అన్నదానాలు ఏర్పాటు చేయించాడు. మండలంలోని నాయనపల్లె, గంగనపల్లె, వరికుంట్ల, ముదిరెడ్డి పల్లె సమీపంలోని లింగమయ్య కొండ తదితర గ్రామాల్లో సంచరిస్తూ ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తూ రాత్రివేళ చిన్నపిల్లలకు విద్యాబుద్దులు నేర్పుతూ ఈప్రాంతీ యులకు సుపరిచితుడయ్యారు. అనంతరం జ్యోతిక్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం చేరుకుని పూజాకార్య క్రమాలు నిర్వహిస్తూ ఉండేవారు. అంతేకాకుండా గరుడా ద్రిలో కఠోర తపస్సు చేశారు. జ్యోతిక్షేత్రంలో అన్నపూర్ణా దేవిని ప్రతిష్టించారు. మారుమూల పల్లెలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన కాశిరెడ్డినాయన ఆకలిగొన్న వారికి పిడికెడు అన్నం పెట్టడం, గోమాతలను సంరక్షించడం ఇష్టంగా అలవర్చుకున్నాడు. తన వద్దకు వచ్చిన భక్తులకు కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తూ ముందు కు సాగారు. ఆయన ఆలయాలను పునర్నిర్మించిన ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తూ వచ్చారు. నేటికీ ఆయన ప్రారంభించిన అన్నదాన కార్యక్రమాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 100 కాశిరెడ్డినాయన దేవాలయాలున్నట్లు సమాచారం. ఎక్కడ కాశిరెడ్డినాయన ఆశ్రమం ఉందంటే అక్కడ నిత్యాన్న దానం ఉన్నట్లేనంటారు భక్తులు. వయస్సు పైబడిన కాశినాయన చివరి అంకంలో తనఇష్టదైవమైన జ్యోతిక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 1995 డిసెంబరు 5వ తేదీన శివైక్యం చెందారు. కాశిరెడ్డినాయన అభీష్టం మేరకు జ్యోతి క్షేత్రంలోనే సమాధి చేశారు. కాశినాయన ఎంతో ఇష్టంగా పెంచుకున్న గోమాత కాశినాయన సమాధి అయిన కొన్నిది నాలకే మృతి చెందింది. అక్కడే గోమాతకు సైతం అక్కడే సమాధి కట్టించారు. ప్రస్తుతం జ్యోతిక్షేత్రంలో కాశినాయన పాలరాతి సమాధిపై 60తెలుగు సంవత్సరాలకు ప్రతీకగా 60 రాతిస్థంభాలతో వివిధ కళారూపాలతో మహాద్భుతంగా కాశినాయన దేవాలయ నిర్మాణం జరుగుతోంది.

జ్యోతిక్షేత్రానికి మార్గం

గుంతకల్లు, కర్నూలు, గుంటూరు తదితర దూర ప్రాంతాల నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు బస్టాం డుకు, రైల్వేస్టేషన్‌కు వచ్చిన భక్తులకు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తారు. కడప జిల్లా మైదుకూరు మీదుగా వచ్చే భక్తులు పోరుమా మిళ్లకు వచ్చేదారిలోని అమగంపల్లె నుంచి సావిశెట్టిపల్లె, వరి కుంట్ల మీదుగా ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ వాహనాల్లో జ్యోతి క్షేత్రానికి చేరుకోవచ్చు. పోరుమామిళ్లకు వచ్చి న భక్తులు ఆర్టీసీ బస్టాండు నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా, ప్రైవేట్ వాహనాల్లో కలసపాడుకు పో యే దారిలోని ఓబుళాపురం నుంచి నర్సాపురం మీదుగా జ్యోతి క్షేత్రానికి చేరుకోవచ్చు.

నిరుద్యోగులకు సౌదియాలో ఉద్యోగాలు

● ఏపీ ఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి నాగార్జున

రాయచోటిటౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అన్నమయ్య జిల్లా అధికారి నాగార్జున పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఓంక్యాప్, అల్ యూసుఫ్, ఎంటర్‌ప్రైజెస్ ద్వారా బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులకు సౌదీ అరేబియా దేశంలో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లాలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 35 ఏళ్ల లోపు అభ్యర్థులు ఏడాదిన్నర నర్సింగ్‌లో అనుభవం కలిగిన అభ్యర్థులు సౌదీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సౌదీ అరేబియాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు పురుషులకు భారత కరెన్సీలో సుమారు రూ.78 వేలు, మహిళలకు రూ.89 వేలు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం skillinternational@apsscdc.inకు 18వ తేదీలోగా బయోడేటా పంపించాలన్నారు. వివరాలకు 9988853335, 9712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లు

- జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి వ్యాఖ్య

రాయచోటి టౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్రం రాకముందు గానీ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గానీ సామాజిక మార్పుల్లో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తూ మెరుగైన సమాజం కోసం సోషల్ ఇంజనీర్లుగా పేరు తెచ్చుకున్నారని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) కడప, అన్నమయ్య జిల్లాల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ నేతృత్వంలో మంగళవారం భోజన విరామ సమయంలో ఐఏఎల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహానుభావులు బ్రిటీష్ వారిపై పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించారని, వారంతా న్యాయవాదులేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా అంబేద్కర్ సహా చాలా మంది న్యాయవాదులు రాజ్యాంగ నిర్మాణ దశలో, రాజ్యాంగం అనుసరించి చేస్తున్న చట్టాల అమలు విషయంలో కానీ న్యాయ మూర్తులు ఉత్తమమైన తీర్పులు చెప్పడంలో గానీ న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తూనే వస్తున్నారని ఆయన కొనియాడారు. సమాజంలో ఎలాంటి సందర్భాల్లో వ్యక్తులు నేరాలకు పాల్పడుతున్నారో అందుకు గల సామాజిక పరిస్థితులను సవివరంగా వివరించి శిక్ష వేయడంలో న్యాయమూర్తులు ఆలోచింపజేసేలా చేసే శక్తి న్యాయవాదులకు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, ఏపీపీ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ధనుంజయ్‌కుమార్, ఆనంద్‌కుమార్, రామాంజనేయులు, వీరభద్ర య్యా, నాగమల్లు, రెడ్డిబాషా, టీవీ రమణ, కిజర్‌అలీ, ఆదిరెడ్డినాయక్, వరలక్ష్మి, ఉత్తేజ్ కుమార్, రవిశంకర్, నిరంజన్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు యశ్వంత్

స్టోరీ టెల్లింగ్ విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థి



అవార్డు అందుకుంటున్న విద్యార్థి

సంబేపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కళా ఉత్సవ్ కార్యక్రమా ల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టోరీ టెల్లింగ్ విభాగంలో జరిగిన పోటీల్లో సంబేపల్లె ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి యశ్వంత్‌రెడ్డి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. విజయవాడలో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి నుంచి విద్యార్థి అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి స్టోరీ టెల్లింగ్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. తమ విద్యార్థి ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

'రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి'

మద నపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, అక్రమంగా రైస్‌మిల్లుల్లో నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా రైస్‌మిల్లుల్లో పోలీసులు సోదాలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించాలన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అక్రమ రవాణా చేస్తున్నవారిపై పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభులు కృష్ణప్ప, సాంబశివ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, దేవా, రెడి పాల్గొన్నారు.

జిల్లాల విభజన గాయం....

● అసంపూర్తిగా పీలేరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు

● రూ.26.50 లక్షల పెండింగ్ బిల్లులు ● చెల్లింపు నుంచి తప్పించుకుంటున్న అధికారులు



అసంపూర్తిగా మిగిలిపోయిన నూతన భవనాలు

పీలేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సరళీకృతం అంటూ జిల్లాల పునర్విభజన చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తూ ఆగమేఘాలపై జిల్లాలను విభజించింది. రాజకీయ కోణంలో చేపట్టిన పునర్విభజనతో అనేక రకాల సమస్యలు తలెత్తాయి. ఇందులో భౌగోళికంగా కొన్ని సమస్యలుంటే కార్యాలయాల రూపంలో మరికొన్ని సమస్యలు జఠిలమయ్యాయి. అయితే విభజనలో చోటుచేసుకున్న మార్పుల్లో కొన్ని సమస్యలపై సరిహద్దు వివాదాలు మొదలయ్యాయి. ఈ కోవకు చెందినదే పీలేరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాల నిర్మాణాలు. పీలేరు మండలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్నప్పుడు ప్రారంభమైన ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాలు జిల్లాల విభజన తరువాత పూర్తిగా ఆగిపోయాయి. ఉమ్మడి జిల్లా అధికారులు బిల్లులు చెల్లిస్తారని నూతన జిల్లా అధికారులు, నూతన జిల్లా అధికారులే చెల్లిస్తారని ఉమ్మడి జిల్లా అధికారులు బాధ్యతల నుంచి తప్పించుకుంటూ ఉండడంతో నిర్మాణ బాధ్యతలు చేపట్టిన పాఠశాల కమిటీ సభ్యులు పనులను సగంలోనే నిలిపివేశారు. దీంతో పాత పాఠశాలలోనే ఇరుకు గదుల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల విభజనతో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించడం మాత్రం మరిచింది. తమ సమస్యలు పరిష్కరించమని బాధితులు ఎన్నిమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోలేదు.

ఉర్దూ విద్యకు పెట్టింది పేరు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉర్దూ విద్యకు పేరెన్నిక గల ప్రాంతాల్లో పీలేరు కూడా ఒకటి. నాలుగు దశాబ్దాలుగా పీలేరులో ఉర్దూ పాఠశాల నడుస్తోంది. పీలేరు పరిసర ప్రాంతాలైన రొంపిచెర్ల, సదుం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పులిచెర్ల కేవీపల్లె మండలాల నుంచి చాలా మంది విద్యార్థులు పీలేరులోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదివేవారు. గాంధీ రోడ్డులో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఇరవై ఏళ్ల కిందట ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి వరకు ఏటా సుమారు 300 మంది విద్యార్థులు ఉర్దూ మాధ్యమంలో టెన్త్ ఉత్తీర్ణులై ఇంటర్, డిగ్రీ కోసం అప్పటి ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటికి వెళ్లేవారు. ప్రస్తుతం పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో 203 మంది విద్యార్థులు చదువుతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో ఉర్దూ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడే వారు. ఆ ఇబ్బందులను తొలగించే లక్ష్యంతో 2018లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పథకం కింద ఐదు గదులు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

రూ.53 లక్షలతో అదనపు గదులు

రూ.53 లక్షల ఆర్ఎంఎస్ఏ నిధులతో ఉర్దూ ఉన్నత పాఠశాల కోసం ఐదు తరగతి గదులు నిర్మించేలా ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కమిటీకి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం పాఠశాల ఉన్న గాంధీ రోడ్డులో తగినంత స్థలం లేకపోవడంతో రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో నిర్మాణాలు ప్రారంభించారు. తొలివిడత పాఠశాల ఖాతాలో రూ.23.50 లక్షల నిధులు కూడా జమయ్యాయి. పనులు జరిగే క్రమంలో పాక్షిక బిల్లుల చెల్లింపు ఉంటుందన్న అధికారుల భరోసాతో కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు. ఆ క్రమంలో 2022 వరకు రూ.23.50 లక్షల బిల్లుల చెల్లింపులు కూడా జరిగాయి. నిధులు వచ్చేస్తాయన్న విశ్వాసంతో కమిటీ సభ్యులు రూ.45 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. అయితే జిల్లాల విభజనలో పీలేరు మండలం అన్నమయ్య జిల్లాలోకి కలిపేశారు. ప్రభుత్వం. కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ ముగిసి పాలన గాడిలో పడిన తరువాత బిల్లుల చెల్లిస్తారని ఎదురుచూశారు. అయితే బాధ్యతలు చేపట్టిన కొత్త జిల్లా అధికారులు పాత పనుల గురించి తమకేమీ తెలియదని తేల్చి చెప్పేశారు.

బిల్లుల కోసం పరుగులు

బిల్లులు వస్తాయన్న నమ్మకం సన్నగిల్లడంతో ఉర్దూ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అటు చిత్తూరుకు, ఇటు రాయచోటికి పరుగులు పెట్టారు. 'మీ ఊరు కొత్త జిల్లాకు వెళ్లింది గనుక కొత్త జిల్లా వారే బిల్లులు చెల్లిస్తారు' అంటూ చిత్తూరు జిల్లా అధికారులు, 'పాత జిల్లా ఉన్నప్పుడు పనులు జరిగాయి కాబట్టి పాత జిల్లా వారే బిల్లులు చెల్లిస్తారు' అంటూ అన్నమయ్య జిల్లా అధికారులు సెలవివ్వడంతో కమిటీ సభ్యులు ఏం చేయాలో పాలుపోక నిర్మాణ పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వం కంటే మరిన్ని ఎక్కువ నిధులు మంజూరు చేయిస్తామంటూ అప్పటి ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు చెప్పిన మాటలు విని ఎక్కువ మొత్తంలో పనులు పూర్తి చేశారు. వారికి రావాల్సిన రూ.23.50 లక్షలకు అదనంగా మరో రూ.15 లక్షల దాకా రావాల్సి ఉందని కమిటీ సభ్యులు వాపోతున్నారు. బిల్లుల సంగతి తేల్చమని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని, జరిగిన నష్టం చాలని, ఇక తాము పనులు చేయలేమని వారు చేతు లెత్తేశారు. గత నెల 30వ తేదీన పీలేరుకు వచ్చిన డీఈఓ సుబ్రహ్మణ్యం దృష్టికి పాఠశాల సమస్యను కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వారికి భరోసా కల్పించారు. తమ ఆశలన్నీ ఆయన మీదే ఉన్నాయని, తమ పాఠశాలకు రావాల్సిన బిల్లులు చెల్లిస్తే ఎలాగోలా పనులు పూర్తి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రస్తుతం నడుస్తున్న భవనంలో కేవలం మూడు గదులు మాత్రమే తరగతి గదులు నిర్వహించేందుకు అనువుగా ఉంది. కూటమి ప్రభుత్వమైనా తమ పాఠశాలను పట్టించుకోవాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

479 కిలోల బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

సుండుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళకాలనీలో అక్రమంగా తరలిస్తున్న 479 కిలోల బియ్యం మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంపై బియ్యం తరలిస్తున్న జబ్బార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. బియ్యం అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వీఆర్వో బసయ్య పాల్గొన్నారు.

హోటల్‌లో చోరీ

సంబేపల్లె, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై మోటకట్ల శివాలయం పక్కన ఉన్న స్టార్ హోటల్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు హోటల్ యజమాని ముక్తా నాగేశ్వర తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. సోమవారం రాత్రి హోటల్‌లో పని ముగించుకుని తాళాలు వేసి పక్కనే ఉన్న ఇంట్లో పడుకున్నారు. మంగళవారం ఉదయం హోటల్ తెరవడానికి వచ్చేసమయానికే వాకిలి తెరుచుకుని ఉంది. దుండగులు బ్లేడుతో చిలుకును కోసి వెనుక వైపు వాకిలి తెరిచి చోరీకి పాల్పడ్డారు. రూ.45 వేలు నగదు, గ్యాస్ సిలిండర్, మిక్సీ, వంట పాత్రలు, బియ్యం, సరుకులు తీసుకెళ్లినట్లు వాపోయారు. మొత్తం లక్ష రూపాయలకు పైన నష్టం జరిగినట్లు తెలిపారు. సంబేపల్లె పోలీసులకు చోరీపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఒక ఇంటి వద్ద ఉన్న వాషింగ్ మిషన్ రెండు రోజుల కిందట చోరీకి గురైంది. వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

యువతిని కాపాడిన పోలీసులు

ఒంటిమిట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న యువతిని పోలీసులు కాపాడారు. సుండుపల్లె మండలం సాకినే బండకు చెందిన ఓ యువతి మంగళవారం సాయంత్రం రైలుపట్టాలపై అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ఎస్ఐ శివప్రసాద్‌కు సమాచారం తెలిపారు. దీంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది యువతిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రేమ వ్యవహారంలో మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నిసున్నట్లు తెలపడంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ చదువుతున్నానని చెప్పడంతో సిబ్బందితో కలిపి కళాశాలకు పంపామన్నారు. యువతి మానసిక స్థితి కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు నాటు సారా స్వాధీనం

- నలుగురి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ పోలీసులు


ములకలచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధి ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల్లో ఎక్సైజ్ పోలీసులు, స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వేపూరికోటలో వేర్వేరు చోట దాడులు నిర్వహించి 81 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అంజనప్ప, శివయ్యను అరెస్టు చేశారు తంబళ్లపల్లె మండలం కోటకొండలో 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అప్పనాయక్‌ను అరెస్టు చేశారు. రెడ్డికోటలో దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఈశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. సీఐ మాధవి కడప ఎన్‌ఫోర్స్‌మెంట్, రాయచోటి డీటీఎఫ్ సీఐలు పాల్గొన్నారు.

చుట్టూ ఎత్తైన కొండలు.. కనుచూపు మేర సముద్రాన్ని తలపించేలా బ్యాక్‌వాటర్.. సొరంగ మార్గం ద్వారా వరదలా వచ్చి చేరే కృష్ణా జలాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. పెన్నా, చిత్రావతి నదుల సంగమం.. రెండు కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణంలో నిర్మితమైన గండికోట ప్రాజెక్టు దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడటంతో పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా.. అభివృద్ధికి బాటలు వేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

గండికోట ప్రాజెక్టు ముఖద్వారం



గండికోట ప్రాజెక్టుకు పర్యాటక శోభ ఏదీ..!




రెండు కొండల మధ్య కనువిందు చేసున్న గండికోటప్రాజెక్టు

- టూరిజం దిశగా అభివృద్ధి చెందని వైనం
- కూటమి ప్రభుత్వంలోనైనా.. అభివృద్ధి చెందేనా!

కొండాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. ప్రస్తుతం పూర్తి నీటి సామర్థ్యంతో నిండుకుండలా ఉంది. 26.85 టీఎం సీల సామర్థ్యంతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు కరువు బారిన పడకుండా జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటోంది. కృష్ణా జలాలతో

చూపరులను ఆకట్టుకునే గండికోట వెనుకజలాలు



కల కలలాడుతూ దర్శనమిస్తున్న గండికోట జలాశ యాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన గత వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు.

గండికోట ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ ద్వారా కృష్ణాజలాలు చేరుతాయి. ప్రాజెక్టులోకి నీళ్ల చేరేందుకు కొండలు అడ్డం ఉండటంతో సొరంగాన్ని నిర్మించారు. మైలవరం మండలం లింగాపురం నుంచి గండి కోట ప్రాజెక్టు వరకు 5.5 కిలోమీటర్లు సొరంగాన్ని నిర్మించారు. ఈ సొరంగ మార్గం ద్వారా కృష్ణాజలాలు గండికోటలోకి చేరుతాయి. ఈ దృశ్యం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. కాగా, ప్రాజెక్టు కింద 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ముంపు ప్రాంతంలో బ్యాక్‌వాటర్‌తో కృష్ణా జలాలు కనువిందు చేస్తున్నాయి.

బోటింగ్ ఏర్పాటు చేస్తే ...

గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే బోటింగ్ ఏర్పాటు తప్పనిసరి. ఇప్పటికే మైలవరం జలాశయంలో బోటింగ్ ఏర్పాటు చేసినా, దానికంటే పెద్దదైన గండికోట ప్రాజెక్టులో ఇంత వరకు బోటింగ్ కూడా ఏర్పాటు చేయ కపోవడం గమనార్హం. సర్ ఆర్థర్ కాటన్ మనవడు రాబర్ట్ కాటన్‌తో పాటు పలువురు గండికోట ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు ప్రాంతంలో అందాలను చూచి మైమరచిపోయారు.

కూటమి ప్రభుత్వంలో... అభివృద్ధి చెందేనా

గండికోట ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గండికోట ప్రాజెక్టు ప్రాం తంలో రిసార్ట్‌లు, వెనుక జలాల్లో బోటింగ్ సౌక ర్యం, వ్యూపాయింట్లు వంటి వాటిని ఏర్పాటు చేసే ందుకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే గండికోట ప్రాజెక్టు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు అవ కాశాలు పుష్కలంగా ఉన్నాయి.



గండికోట ప్రాజెక్టు నుంచి వివిధ ప్రాజెక్టులకు నీరు వెళ్లే మెయిన్‌కెనాల్



గండికోట ప్రాజెక్టును సందర్శించిన సర్ ఆర్థర్ కాటన్ మనవడు రాబర్ట్‌కాటన్ తదితరులు (ఫైల్‌ఫోటో)

త్రుటిలో తప్పిన ప్రమాదం

- లారీని ఢీ కొట్టిన మరో లారీ ● భారీగా స్తంభించిన ట్రాఫిక్



ప్రమాదానికి గురైన లారీలు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ సంఘట నలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి గురైన లారీలు రోడ్డు మధ్య ఉండడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ జయరాములు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నంద్యాల నుంచి కోడూరుకు లోడ్‌తో వెళుతున్న లారీని.. రాజంపేట నుంచి కడప వైపుగా వస్తున్న మరో లారీ కడప సెంట్రల్ జైలు వద్దకు రాగానే గుంతను తప్పించబోయి ఢీ కొంది. ప్రమాదంలో ఇరువురు లారీ డ్రైవర్లకు ఎలాంటి గాయాలు తగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

కుందూ నదిలో పడి యువకుడి మృతి



చాపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చాపాడు గ్రామానికి చెందిన పూజారి మహేష్‌బాబు (32) అనే యువకుడు కుందూనదిలో పడి మృతి చెందా డు. సురేష్‌బాబు ఈనెల 9న సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో కాలకృత్యాల కోసం గ్రామం ఆనుకుని ఉన్న కుందూ నది వద్దకు వెళ్లి నీటిలో కారుజారి పడిపోయాడు. అప్పటికే చీకటి పడడంతో ఎవరు ఈ ప్రమాదాన్ని గమనించలేదు. మంగళవారం ఉదయం అతని అన్న లక్షుమయ్య తమ్ముడి ఆచూకీ కోసం నది వద్దకు వెళ్లి చూడగా చాకలి రేవు వద్ద మృతదేహం ఉన్న విషయాన్ని గుర్తించారు. సురేష్‌బాబుకు మానసిక పరిస్థితి కూడా బాగలేదు. ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. లక్షుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాయచోటి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండ గా ద్విచక్ర వాహనం ఢీకొన డంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు రాయచోటి పట్టణంలోని మాసా పేటకు చెందిన కత్తి అంకయ్య (76) పట్టణ పరిధిలోని మదనపల్లి రోడ్డులో శ్రీనివాసపురం క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అంక య్యను స్థానికులు రాయచోటి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ



ముద్దనూరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయబోర్లకు సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీకి గురైనట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ తెలిపారు. సోమవారం చింతకుంట గ్రామానికి చెందిన చంద్రమోహన్, కమ్మవారిపల్లెకు చెందినసంజీవగాళ్ల వీరమ్మకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగలగొట్టి.. అందులోని కాపర్ వైరు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

తాగునీటి మోటర్ల వైర్లు..

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత తాగునీటి మోటర్లకు సంబంధించిన వైర్లను దొంగలు చోరీ చేశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5గంటలకే తాగునీటిని ప్రజలకు అందించేవారు. అయితే మంగళవారం ఉదయం పంచాయతీ సిబ్బంది మోటర్ల వద్దకు వెళ్లగా కేసీ కెనాల్ కట్టపై, మద్దిమాను వద్ద ఉన్న తాగునీటి మోటార్ల వైర్లు కోసుకెళ్లినట్లు గమనించారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : అదనపు ఎస్పీ

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ అండగా ఉంటుందని అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాష్‌బాబు అన్నారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా ప్రమాదానికి గురై కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ నాగార్జునరెడ్డి మృతి చెందాడు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నాగార్జునరెడ్డి సతీమణి బి.లక్ష్మీకాంతమ్మకు ఏఎస్పీ రూ.2.5 లక్షల చెక్‌ను ఆర్థిక సాయం కింద అందజేశారు. అనంతరం ఏఎస్ఐ కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని.. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీపీవో ఏఓ జ్యోతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్ఐ భార్యకు చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన యువకుడు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఐటిఐ సర్కిల్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు ఫాతిమా కాలేజ్ సమీపంలోని ఫంక్షన్‌కు పల్సర్ బైకుపై వెళుతున్నారు. ఐటీఐ సర్కిల్ వద్ద ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్దకు రాగానే పార్కింగ్ చేసిన వాహనాన్ని వేగంగా వచ్చిన బైకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైకు నడిపిన యువకుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇరువురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలానికి తాలుకా పోలీసులు చేరుకొని ప్రమాద ఘటనను పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైకును ఢీకొన్న కారు.. వ్యక్తికి గాయాలు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద బైకును కారు ఢీకొనడంతో బైకులో వెళుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలోని దొమ్మరనంద్యాలకు చెందిన వినయ్ కుమార్ బైకులో సొంత పని నిమిత్తం కడపకు వచ్చారు. రిమ్స్ ఆసుపత్రి సమీపంలోని రింగ్ రోడ్డుపై వెళుతుండగా కారు వచ్చి ఢీ కొనడంతో వినయ్‌కుమార్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

యువకుడిపై దాడి - కేసు నమోదు

కడప(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ కాలనీలో మంగళవారం ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆర్టీసీ కాలనీకి చెందిన దామోదర్ రమణల మధ్య మాటమాట పెరిగి ఘర్షణ పడ్డారు. దామోదర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రమణపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయాలు తెలపవచ్చు

- సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి

కడప ఎన్జీఆర్ సర్కిల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిటీకి అభిప్రాయాలను తెలపవచ్చని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 1న భారత అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు కులాల్లోని ఉప వర్గీకరణ కోసం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో వన్‌మ్యాన్ కమిటీని నియమించిందని తెలిపారు. సంబంధిత ఏకసభ్య కమిషన్ కార్యాలయం గిరిజన ప్రధాన కార్యాలయం, మొదటి అంతస్తు కోనేరు లక్ష్మయ్యవీధి, మొగల్రాజపురం, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ విషయంపై ఏదైనా సంతకంతో కూడిన రాతపూర్వక మెమొరాండం, రెప్రజెంటేషన్లు కార్యాలయం పనివేళల్లో జనవరి 9 వరకు స్వయంగా కానీ, రిజిస్టరు పోస్టు ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఈ మెయిల్ ఐడీ ఓఎంఎస్సీ సబ్ క్లాసిఫికేషన్ డాట్ కామ్ ద్వారా కూడా తెలపవచ్చని ఆమె తెలిపారు.

మానవహక్కులకు భంగం కలిగితే సహించే ప్రసక్తే లేదు

- ఎస్ఎస్‌జేఐసీ హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్

కడప మారుతీనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడైనా మానవహక్కులకు భంగం కలిగితే సహించే ప్రసక్తే లేదని షా సోషియల్ జస్టిస్ ఫర్ ఇంటర్‌నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ షా మహ్మద్ స్పష్టం చేశారు. ప్రజల మాన ప్రాణాలతో చెలగాటమాడితే వారి హక్కుల పరిరక్షణ కోసం తాము అక్కడ వుంటామన్నారు. 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆ కౌన్సిల్ ఏపీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సుంకేసుల బాదుల్లా అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలందరికీ సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు కలదన్నారు. అలాంటి హక్కును కొంతమంది పనిగట్టుకుని హరించాలని చూడడం సరైంది కాదన్నారు. అనంతరం కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన అలీషేర్‌ను నియమించారు. కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్, ప్రజాసంఘాల నాయకులు నజీర్‌అహ్మద్, మన్సూర్ అలీఖాన్, తాహిరుల్లా ఖాద్రి, పి.పెద్దన్న, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు.

కారుణ్య నియామక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కడప రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాలకు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు మొత్తం నలుగురు అభ్యర్థులు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల పోస్టులు ఖాళీగా లేకపోవడంతో వీరికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను రోస్టర్ పాయింట్ల ప్రకారం త్వరలో కేటాయిస్తామని జడ్పీ సీఈవో తెలిపారు. ఉద్యోగం చేస్తున్న కుటుంబ పెద్ద మరణించడంతో అర్హులైన కుటుంబంలో ఒకరికి వీలైనంత త్వరగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనలో పరిపాలనాధికారి(ఏవో) భాస్కర్‌రెడ్డి, స్టెనో శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అస్వస్థత

- ఆస్పత్రికి పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

వేంపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థుల్లో కొందరు గత నాలుగైదు రోజులుగా విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. రోజుకు 40 నుంచి 50 మంది ఆస్పత్రికి వస్తున్నట్లు తెలిసింది. ట్రిపుల్‌ఐటీలోని పాత క్యాంపస్‌లో చదువుతున్న ఒంగోలు విద్యార్థులకు ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. బయటి నుంచి ఆహారం తెప్పించుకోవడం వల్ల గానీ, మెస్‌లో భోజనం సక్రమంగా లేకపోవడమో, నీళ్లలో కోతులు తిరగడమో కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

'మానవహక్కులు భవిష్యత్‌కు మార్గదర్శకాలు'

కడప రూరల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మానవహక్కులు భవిష్యత్‌కు మార్గదర్శకాలు అని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను నిర్దేశించినవన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలను, ఉచిత న్యాయ సహాయాన్ని, లీగల్ సర్వీసెస్ తదితర అంశాలను వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పి.హరిబాబు, ఎం.శాంత, పి.మనోహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి


నిమ్మనపల్లె రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీపీవో బాలకృష్ణారెడ్డి


పీటీఎం మండలంలోని మల్లెల రెవెన్యూ సదస్సులో అర్జీదారులకు రసీదును అందిస్తున్న అధికారులు


ములకలచెరువు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె మండలం బసినికొండ-1 గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రెవిన్యూ అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలని నిర్ణయించిందన్నారు. దీనికి అనుగుణంగా ప్రజల వద్దకే అధికారులు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. కాగా మంగళవారం సదస్సులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాసుపుస్తకాలు, భూముల వన్-బీ, భూముల హద్దుల సమస్యలపై 72 మంది అర్జీలు ఇవ్వగా 14 అర్జీలు గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని ఇచ్చారు. రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న అర్జీలను 30 రోజుల్లో పరిష్కరించాలని, వివిధ కారణాల వలన వీలుకాకుంటే ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తహసీల్దార్ ఖాజాబీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, ఆర్‌ఐ శేషాద్రి, వీఆర్‌వో ప్రసాద్, టీడీపీ నాయకులు కత్తి లక్ష్మన్న, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ములకలచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను శాశ్వితంగా పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మద్దినాయనిపల్లెలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 37 వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్నారు. ఆనాడు రైతులను భయపెట్టి బలవంతంగా భూములు లాక్కున్నారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో భూములు కోల్పోయిన బాధితులందరికి కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామన్నారు. నియోజకవర్గంలోని భూ బాధితులు రికార్డులను రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు అర్జీల రూపంలో అందజేసి రసీదు పొందాలన్నారు. అనంతరం ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సదస్సులో నోడల్ ఆఫీసర్ రషీద్‌ఖాన్, తహసీల్దార్ ప్రదీప్, ఆర్‌ఐ అనీషా, అటవీశాఖ అధికారి ప్రకాష్ కుమార్, డిప్యూటీ సర్వేయర్ మహమ్మద్ రఫీ, నాయకులు మస్తాన్‌రెడ్డి, రమణారెడ్డి, చెన్నకేశవులు, శ్రీనివాసులు, రవి, సురేష్, గోపాల్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీకేటీ భూములు విక్రయిస్తేచట్టరీత్యా నేరం

నిమ్మనపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డీకేటీ భూములు కొనడం, అమ్మడం కాని చేస్తే చట్టరీత్యా నేరమని ప్రత్యేక అధికారి, డీపీవో బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముష్టూరు గ్రామ పంచాయతి ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎక్కువగా నిరుపేదలకు ఇచ్చిన డీకేటీ భూములను ఇతరులు కొనుగోలు వాటికి వన్‌బి కావాలని వస్తున్నారని అలాంటి వాటిని కొనడం, అమ్మడం చేయరాదని ఒక వేల పట్టాదారునికి అవసరము లేకపోతే ప్రభుత్వమే స్వాధీనం చేసుకొంటుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులో 169 అర్జీలు వచ్చాయని ప్రతి అర్జీని 45రోజులలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రావు, మునిరత్నం, చెంద్రాయుడు, మల్లికార్జున. రమణ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: రెవెన్యూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మల్లెల గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సుల్లో మొత్తం 47 అర్జీలు రాగా అందులో అధిక శాతం రెవెన్యూకు సంబంధిచినవే కావడం గమనార్హం. ఇందులో పెన్షన్లకు సంబంధించి 4 అర్జీలు రాగా పౌరసరఫరాలకు సంబంధించినవి 4, 1 అర్జీ హౌసింగ్‌కు సంబంధించి వచ్చాయి. ఇందోలో ముఖ్యంగా మల్లెల గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయానికి, సౌమ్యేశ్వరస్వామి ఆలయాలకు చెందిన దేవదాయ మాన్యాం భూములకు సంబంధించి ఇంతవరకు పాస్‌బుక్కులు లేవని గ్రామంలో 509, 511 సర్వే నంబర్లల్లో ఉన్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ ఈవో మునిరాజ్, అసిస్టెంట్ రమణ ఆలయ పూజారి చంద్రశేఖర్ శాస్త్రీలతో కలసి అధికారులకు అర్జీని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, స్థానిక నాయకులు గొందిపల్లె బాస్కర్‌రెడ్డి, మునిరెడ్డి, కుందిలి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 49 అర్జీలు

తంబళ్లపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 49 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. మంగళవారం నోడల్ అధికారి మధుసూధన్ ఆధ్వర్యంలో గోపిదిన్నె సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని, భూమి ఆన్‌లైన్ చేయాలని, మ్యూటేషన్లు తదితర సమస్యలపై 46 అర్జీలు రాగా, డికేటి పట్టాలు మంజూరు చేయాలని 2, భూ ఆక్రమణలు తొలగించాలని ఒక అర్జీ వచ్చాయి. అధికారులు రైతుల నుంచి వచ్చిన అర్జీలను పీజీఆర్‌ఎస్ వెబ్‌సైటులో నమోదు చేసి రసీదులను అందచేశారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి, డీటి రవీంద్రనాయక్, , ఎఫ్‌బీవో రామరాజు, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తాం

కలికిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో రైతులకు సంబంధించిన సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని కలికిరి తహసీల్దారు మహేశ్వరీబాయి హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని మర్రికుంటపల్లెలో రెవెన్యూ సదస్సులో మొత్తం 54 అర్జీలు రైతులు అందజేశారు. అందులో మ్యుటేషన్, పాస్‌పుస్తకాలకు సంబంధించిన 1బి ఖాతాల్లో సవరణలకు సంబంధించి అత్యధికంగా 32 దరఖాస్తులు అందాయి. భూముల సర్వే, కొలతలు, సరిహద్దుల గుర్తింపు తదితర సమస్యలపై 11, గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా అందిన వాటిపై పెండింగ్‌లో ఉన్న 11 సమస్యలను నమోదు చేసుకున్నారు. నోడల్ ఆఫీసర్ జయప్రకాష్, దేవదాయ శాఖ ఈవో మంజుల, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జ్యోతి, సర్పంచు రెడ్డిరాము, ఎంపీటీసీ చిన్నరెడ్డెయ్య, టీడీపీ నాయకులు వెంకటపతి, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు వారి సమస్యలను రెవెన్యూ సదస్సులో తెలిపి పరిష్కారం పొందవచ్చన్నారు. ఇందులో భాగంగా భూ సమస్యలపై 15 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీపతి, ఎంపీడీవో వెంకటేశులు, వీఆర్వోలు సదాశివ, శ్రీనివాసులు, సర్పంచ్ లలిత, నాయకులు మూర్తిరావు, ఎల్లుట్ల మురళీ, రెడ్డిసుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: మండలంలోని ముడియంవారిపల్లె సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వివిధ సమస్యలపై 27 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ ఫణికుమార్ తెలిపారు. ఇందులో మ్యుటేషన్‌లకు సంబంధించి 9, ఈ పాసుపుస్తకాల కోసం 10, కులధ్రువీకరణ పత్రాలకు 3, సర్వే 1, పట్టాల మంజూరు విషయమై 3, సవరణకు 1 వచ్చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో నోడల్ అధికారి రవిచంద్రబాబు, వీఆర్వో లు శంకరయ్య, రామకృష్ణ, దొరస్వామి పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించాలని వినతి

వాల్మీకిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు దీర్ఘకాలంగా నెలకొన్న దారి సమస్యను పరిష్కరించాలని వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ పామిలేటికి విన్నవించారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతుల నుంచి భూసమస్యలపై వినతులు స్వీకరించి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, సబ్‌రిజిస్టర్ స్వరూప్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సుగుణ, అధికారులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లబైలు పంచాయతీ జగన్‌కాలనీలో మంగళవారం పదిమంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.15,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాలుకా ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఉదయం 6 గంటలకే కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తాలుకా పోలీసులు దాడులు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

మళ్ళీ తగ్గిన చికెన్ ధరలు!

కలికిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడి మాంసం ధరలు మార్కెట్లో రోజు రోజుకూ పతనమవుతున్నాయి. మంగళవారం కిలో రూ.120లకు పడిపోయాయి. పది రోజుల క్రితం నుంచి వరుసగా ప్రతి రెండు రోజులకు ఒకసారి ధరలు తగ్గించి అమ్ముతున్నారు. మొదట కిలో రూ.220 నుంచి రూ. 180కి తగ్గిపోగా వారం క్రితం అవి రూ.160లకు పడిపోయాయి. రెండు రోజుల ముందు మరీ రూ.140లతో అమ్మకాలు సాగించారు. తాజాగా మంగళవారం కనిష్ట ధరతో కిలో రూ.120 వంతున అమ్మకాలు సాగించారు. గత నెల కార్తీక మాసం కావడంతో యథాప్రకారం మాంసం అమ్మకాలు తగ్గిపోయాయి. దీంతో పెంపకందార్ల వద్ద కోళ్ళ నిల్వలు పేరుకుపోయాయని చెపుతున్నారు. మామూలుగా సరాసరిన రెండు కిలోల బరువుకు వస్తే కోళ్ళను మార్కెట్లకు తరలించడం ఆనవాయితీ. అలా కాకుండా కార్తీక మాసం కారణంగా మాంసం డిమాండు తగ్గిపోవడంతో కోళ్ళ నిల్వలు పేరుకుపోయి.. వాటిని హోల్ సేల్ ధరలను తగ్గించి మార్కెట్లోకి తోసేస్తున్నారని, దీని కారణంగా ధరలు రోజురోజుకు తగ్గుము ఖం పడుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి.

క్యాటిల్ షెడ్స్ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టండి


కురబలకోట ఎస్సీ కాలనీలో క్యాటిల్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగయ్య తదితరులు

కురబలకోట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్యాటిల్ షెడ్స్ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. మంగళవారం కురబలకోట ఎస్సీ కాలనీలో క్యాటిల్ షెడ్స్ నిర్మాణపనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి 62 షెడ్స్ మంజూరు కాగా 52నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. కాగా ఈ షెడ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

13న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు

పీలేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో ఈ నెల 13న జరిగే 'మహాదీపం' కార్యక్రమానికి పీలేరు నుంచి ప్రత్యేక బస్సు నడుపు తున్నట్లు ఆర్టీసీ పీలేరు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. పీలేరులో మంగ ళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక బస్సు 13వ తేదీ ఉదయం 6 గంటలకు పీలేరులో బయలుదేరి 10 గంటలకు అరుణాచ లానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. గిరిప్రదిక్షణ పూర్తయిన తరు వాత రాత్రి 8 గంటలకు అక్కడ బయలుదేరి తిరిగి పీలేరుకు చేరుకుం టుందన్నారు. రానుపోను ఛార్జీలు రూ.700లుగా నిర్ణయించామని, ఆసక్తి గల వారు ఆర్టీసీ వెబ్‌సైట్‌లోగానీ, పీలేరు బస్టాండులోని కంట్రోల్ పాయింట్‌లోగానీ, 9959225679, 9014700628 నెంబర్లను సంప్రదించి టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చునని ఆయన వివరించారు.

ఆఫీసు విధుల నుంచి వీఆర్‌ఏలను మినహాయించాలి

పీలేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి విధుల్లో తమకు నైట్ వాచ్‌మ్యాన్, అటెండర్ వంటి ఆఫీసు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీలేరు మండలంలోని వీఆర్‌ఏలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పీలేరు మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు నాగరత్న మంగళవారం డిప్యూటీ తహసీల్దారు రెడ్డప్పరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాము అనేక విధుల కారణంగా అనునిత్యం క్షేత్రస్థాయిలో ఉంటున్నామని, ఆఫీసు విధుల నిర్వర్తించడం తమకు కష్టంగా ఉంటుందన్నారు. వీఆర్వోలు, ఆర్‌ఐలకు చేదోడు వాదోడుగా ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందిస్తున్నామని ఆయన తెలిపారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం


వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న వాల్మీకినాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నూతనంగా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నల్లబోతుల నాగరాజు, మండెంప్రభాకర్‌లను వాల్మీకి మహాసేన, టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తురాశి హరికృష్ణ, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, వాల్మీకి నాయకులు నల్లబోతుల సుదర్శన్‌బాబు, బొగ్గిటి కృష్ణమూర్తి, నాగినేని గోవిందులు మంగళవారం స్థానిక యూనియన్‌క్లబ్‌లో పూలమాలతో, దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. డైరెక్టర్లు మరెంత ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

బస్సుల కండీషన్ మెరుగుపరచాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ బస్సుల కండీషన్ మెరుగుపరచాలని డిప్యూటీ సీఎంఈ నరసింహలు పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె వన్ అండ్ టూ డిపోల్లో గ్యారేజీలను బస్సుల కండీషన్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం గ్యారేజ్‌లో ఆర్టీసీ సిబ్బందితో సమావేశమై ఆయన మాట్లాడుతూ బస్సుల కండీషన్ బాగా ఉంటేనే రోడ్డుమార్గంలో పంపాలన్నారు. మధ్యమార్గంలో బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లకు డ్రైవింగ్‌లో సూచనలు, సలహాలను అందించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

థిల్లాన సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో థిల్లాన ది మెగా ఫెస్ట్ ఆఫ్ ట్యాలెంట్ సాంస్కృతిక పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవస్థాపకుడు డ్యాన్స్ మాస్టర్ వెంకటేష్ పేర్కొన్నారు. మదనపల్లె ప్రజలు, పాఠశాల, కళాశాల యాజమాన్యం ప్రోత్సాహం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ నెల 15న స్థానిక బీటీ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, ఇందులో డాన్స్, పాటలు, పెయింటింగ్, మెహందీ, రంగోళి, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు


ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న మురళీమోహన్ రెడ్డి

పీలేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని 25 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యిందని పీలేరు మండలం తలపుల గ్రామానికి చెం దిన మురళీ మోహన్ రెడ్డి అనే వ్యక్తి రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. తలపులలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సు గ్రామసభకు ఆర్డీవో హాజరుకాగా ఆయనను కలిసి తలపుల గ్రామ పరిధిలోని సర్వే నెం.1960/1, 1960/2, 2360/2లో ఉన్న 25 ఎకరాల ప్రభుత్వ భూమిని రాజశే ఖర రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని తెలిపారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆయన ఆర్డీవోకు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఫాంహౌస్ నిర్మించుకోవడమే కాకుండా ఆర్ అండ్ బీ రోడ్డును కూడా ఆక్రమించుకున్నా రని తెలిపారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని స్థానిక అధికారులను ఆదేశించా రు. తలపుల గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో 149 అర్జీలు అందినట్లు తహసీల్దారు భీమేశ్వర రావు తెలిపారు.

'చలో విజయవాడ' కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా నేతలు



విజయవాడలో అన్నమయ్య జిల్లా ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

పీలేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు కోరుతూ విజయవాడలో మంగళవారం జరిగిన 'చలో విజయవాడ' కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్‌ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ సీపీఎస్‌ను ఏడాదిలోగా రద్దు చేస్తామని నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని గుర్తు చేసేందుకు ప్రపంచ మావన హక్కుల దినోత్సవం అయిన మంగళవారం విజయవాడలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ విధానాలను తెచ్చిన చంద్రబాబు నాయుడు సీపీఎస్‌ను కూడా రద్దు చేస్తారన్న విశ్వాసంతో రాష్ట్రంలోని లక్షలాది సీపీఎస్ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. వీలైనంత త్వరగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

వైద్యుల కొరత ఉన్నా.. రోగులకు సేవలందిస్తున్నాం

● సూపరింటెండెంట్ డాక్టర్ గాయత్రి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్నా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గాయత్రి పేర్కొన్నారు. మంగళవారం ఆస్పత్రి డాక్టర్లు, హెడ్ నర్సులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే కేసులలో ఎక్కువగా రెఫరల్ కాకుండా ఎలా చేయాలో ఈ సమావేశంలో డాక్టర్లుకు ఆదేశాలిచ్చామన్నారు. వేరే విభాగాల నుంచి డాక్టర్లను రప్పించుకుని వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయండి


గృహ నిర్మాణాలపై సూచనలు ఇస్తున్న పీడీ సాంబశివ

పెద్దమండ్యం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ పేర్కొన్నారు. మంగళవారం పెద్దమండ్యం లే అవుట్‌లో పక్కా గృహనిర్మాణాలను హౌసింగ్ పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పక్కాగృహాల నిర్మాణాల బిల్లుల చెల్లింపులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులతో తరుచు సమావేశాలు నిర్వహించి హౌసింగ్ సిబ్బందికి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోకుంటే శాఖపరమైన చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. ఉపాధి నిధులతో లే అవుట్‌లలో మట్టిని తోలించాలన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, మండల హౌసింగ్ ఏఈ అక్రం, ఇజనీరు అసిస్టెంట్ సందీప్ కూటమి నేతలు మండల తెలుగు యువత అధ్యక్షుడు నారా గంగాధర, టీడీపీ రైతుసంఘ నాయకుడు మహేశ్వర, రఘునాధరెడ్డి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని మల్లెల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఎంఈవో నారాయణతో కలిసి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, కోడిగుడ్లు వంటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలకు, గర్భిణిలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు.

బీమా పథకాన్ని మామిడి రైతులు వినియోగించుకోవాలి


మర్రిమాకులపల్లెలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

పీలేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ పీలేరు ఏడీ రమణరావు తెలిపారు. పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తాండాలో మంగళవారం వ్యవసాయ, ఉద్యాన శాఖ సంయుక్తంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ఎకరాకు రూ.2250ల ప్రీమియం చెల్లించి తమ పంటకు బీమా చేయించుకోవాలన్నారు. తమ దగ్గరలో ఉన్న బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతులు నేరుగా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్ ద్వారా బీమా చేయించుకోవచ్చునన్నారు. అనంతరం ప్రస్తుత సీజన్‌లో మామిడిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, హెచ్‌వో సుకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రమ్యకు ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డు


అవార్డు పొందిన రమ్యను అభినందిస్తున్న గురుప్రసాద్

మదనపల్లె టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బయోటెక్నాలజీలో శాస్త్ర పరిశోధనలు చేస్తూ కొత్త అంశాలను కనుగొంటున్న జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేఎస్ రమ్యకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం ది నియోటియా యూనివర్సిటీ నుంచి ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. మంగళవారం ఈ మేరకు డాక్టర్ రమ్యకు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్, అవార్డు పోస్టులో వచ్చింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ బయోటెక్నాలజీ బోటనీ శాస్త్రంలో రమ్య ప్రొటీన్ శుద్ధీకరణ, ఎంజైమా లజీ, మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు కనుగొనడంలో పరిశోధనలు నిర్వహిం చారన్నారు. అంతే కాకుండా చిట్‌నెస్ నిర్మాణంలో పీడీబీ ఐడీ రచించి పేటెంట్ హక్కులు కూడా పొందరన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న నియోటి యా యూనివర్సిటీ ఆమెకు ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డు అందించిందన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి అవార్డు గ్రహీతను అభినందించారు.

బీజేపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేత జబ్బల


ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వైసీపీ నేత, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీని వాసులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం విజయవాడలో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి మధుకర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులును బీజేపీ ఇన్‌చార్జి మధుకర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాజ్యసభ మాజీ ఎంపీ, బీసీ సంఘాల నేత ఆర్.కృష్ణయ్యతో కలసి జబ్బల బీజేపిలో చేరడంతో పాటు, పార్టీ సభ్యత్వం కూడా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్యను జబ్బల దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. అనంతరం బీజేపి రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య నామినేషన్ కార్యక్రమంలో జబ్బల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ..కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, ఆర్.కృష్ణయ్యతో పాటు బీజేపీలో చేరినట్లు తెలిపారు.

ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించండి


మరమ్మతులకు గురైన ఆర్‌వో ప్లాంట్

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కాట్లగల్లు పంచా యతీలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురి కావడంతో కాట్లగల్లు గ్రామంలో తీవ్రంగా మంచినీటి కొరత ఏర్పడిందని మంగళవారం గ్రామస్థు లు స్థానిక ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌కు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఈ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మూడు సంవత్సరాల క్రితం గ్రామంలో ఏర్పాటు చేశారని గత పది రోజులుగా మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వాటర్ ప్లాంటును మరమ్మతులు చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డిని కోరగా తనకు సంబంధం లేదని అంటున్నాడని గ్రామస్థులు వాపోయారు.

13న ధర్మపథంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 13న ఉదయం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. వేడుకల అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

14న పీలేరులో సాగునీటి సంఘ ఎన్నికలు

పీలేరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలోని మూడు చెరువులకు ఈ నెల 14న సాగునీటి సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల డీటీ చంద్రశేఖర్ తెలిపారు. పీలేరు పట్టణంలోని అయ్యప్పనాయుని చెరువు, తలపుల పంచాయతీలోని సూరప్పగారిచెరువు, దొడ్డిపల్లె పంచాయతీలోని చింతల చెరువుకు ఎన్నికలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. మూడు చెరువులకుగాను 410 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు. అయ్యప్పనాయుని చెరువుకు పీలేరు ఎంపీడీవో శివశంకర్, సూరప్పగారిచెరువుకు పీఆర్ ఏఈ రామకృష్ణ నాయక్, చింతల చెరువుకు తహసీల్దారు భీమేశ్వర రావు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు.